

నేటి దినపత్రిక
సూర్య
ఉత్తరాంధ్ర
www.suryaa.com
శుక్రవారం
24-5-2024
పేజీల 5
విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం
విజయనగరం
శ్రీకాకుళం

సింహాచల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

విశాఖపట్నం, మే 23, మేజర్‌న్యూస్: సింహాచలం సింహాద్రినాధుని క్షేత్రానికి గురువారం భక్తులు పోటెత్తారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా అప్పన్న స్వామి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు సంప్రదాయబ ద్ధంగా స్వామి వారికి చందన సమర్పణ పూర్తిచేశారు. తెల్లవా రు జామున రెండు గంటలకు స్వామి వారికి మేల్కొలుపు పలికారు. సుప్రభాత సేవలు నిర్వహించి, సుగంధ ద్రవ్యాలు మిళితం చేసి సిద్ధం చేసిన శ్రీ గంధాన్ని స్వామికి సమర్పణ చేశారు. స్వామి వారి నిజరూప దర్శనం కోసం, వైశాఖ మిగతా 2లో

రుతు పవనాలకు ముందే తుఫాన్

- రేపటి కల్లా అల్పపీడనం ప్రభావంతో వానలు
-ఆదివారం బెంగాల్, బంగ్లాదేశ్‌ల మధ్య తీరం దాటే ఛాన్స్



విశాఖపట్నం, మే 23, మేజర్‌న్యూస్: బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం మరింతగా బలపడుతోంది. అల్ప పీడనం కారణంగా గత కొద్ది రోజులుగా సముద్రంలోనే భారీ వానలు పడుతున్నాయి. అయితే అల్పపీడనం తీవ్ర తుపానుగా మారి ఆదివారం సాయంత్రానికి పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ ల మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. ప్రస్తుత సీజన్ కు సంబంధించి రుతుపవనాలకు ముందు ఏర్పడుతున్న మొట్టమొదటి తుపాన్ ఇదేనని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. హిందూ మహా సముద్రంలో ఏర్పడే తుపానులకు పెట్టే పేర్ల క్రమంలో.. ప్రస్తుతం ఉన్న పేరు రెమల్. దీనిని ఈ తుపానుకు పెట్టనున్నట్టు వెల్లడించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పరిస్థితిపై విపత్తుల సంస్థ ఎండీ రోణంకి కూర్మనాధ్ మాట్లాడుతూ "మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం శుక్రవారం ఉదయానికల్లా వాయుగుండంగా మారుతుందని వెల్లడించారు. తర్వాత మరింత బలపడి శనివారం ఉదయానికల్లా తుపానుగా, ఆ తర్వాత తీవ్ర తుపానుగా మారుతుందని, ఆదివారం సాయంత్రానికల్లా మిగతా 2లో

అనకాపల్లిలో 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్

ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్
- జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

అనకాపల్లి, మే 23, మేజర్‌న్యూస్: జూన్ 1వ తేదీన ఎగ్జిట్ పోల్స్, జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికలు -2024 కౌంటింగ్ ఉన్న నేపథ్యంలో అనకాపల్లి జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించటమే ధ్యేయంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సమక్షంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అర్మ్డ్ రిజర్వు, లా అండ్ ఆర్డర్ పోలీస్ సిబ్బందితో అనకాపల్లి పట్టణం, నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద గురువారం "మాబ్ ఆపరేషన్"మాక్ డ్రిల్" నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఏవైనా అవాంఛనీయ సంఘటనలు పోలీసుల దృష్టికి వచ్చినప్పుడు, 144 సెక్షన్ అమల్లో ఉన్న సందర్భంలో, ప్రజల శాంతి భద్రతల దృష్ట్యా పోలీసులు ఏ విధంగా స్పందించాలి, అక్రమ జన సమూహాలను ఏ విధంగా చెదరగొట్టాలి అనే పద్ధతిలో భాగంగా అక్రమ జన సమూహాలను కంట్రోల్ చేయుటకు మొదటగా వార్నింగ్ ఇచ్చుట, అది వినకపోతే మెజిస్ట్రేట్ అనుమతితో టియర్ గ్యాస్ ప్రయోగించుట, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీ చార్జ్, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ ప్రయోగించుట, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్, అప్పటికి పరిస్థితి అదుపులోకి రాని ఎడల ఫైరింగ్ చేయుట వంటివి ఈ మాక్ డ్రిల్ లో ప్రదర్శించడం జరిగిందన్నారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తూ విధ్వంసానికి ప్రయత్నించే అల్లరి మూకలను అణచి వేసేందుకు, అత్యవసర సమయంలో పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చేలా ప్రత్యేక టీములు ఏర్పాటు చేయడం మిగతా 2లో

కేజీహెచ్‌కు రూ. 40 లక్షల విలువైన 5 బ్యాటరీ కార్లు

-పేద రోగుల కోసం ఉచింతంగా అందించిన స్టీల్‌ప్లాంట్
-ప్రారంభించిన జిల్లా కలెక్టర్ మల్లిఖార్జున

విశాఖపట్నం, మే 23, మేజర్‌న్యూస్: కేజీహెచ్ రోగుల కోసం బ్యాటరీతో పని చేసే 5 బ్యాటరీ కార్లను విశాఖ స్టీల్‌ప్లాంట్ విరాళంగా అందజేసింది. ఈ కార్లను గురువారం జిల్లా కలెక్టర్ మల్లిఖార్జున స్వయంగా నడిపి ప్రారంభించారు. కార్పోరేట్ ఎన్విరాన్‌మెంట్ రెస్పాన్సబిలిటీ ఇనిషియేటివ్ కార్యక్రమంలో భాగంగా స్టీల్‌ప్లాంట్ ఈ కార్లను బహూకరించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ మల్లిఖార్జున మాట్లాడుతూ ఎంతో సేవా గుణంతో రోగులకు సహాయ పడే బ్యాటరీ కార్లను విశాల హృదయంతో ముందుకు వచ్చి కేజీహెచ్‌కు అందచేసినందుకు విశాఖప ట్నం స్టీల్ ప్లాంట్ యాజమాన్యాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈ కార్లను రోగుల కోసం ఇవ్వడం పేద రోగులకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. నడవలేని రోగుల కోసం ఇచ్చిన ఈ వాహనాలను అందించిన విశాఖ ఉక్కు కర్మాగార యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున, డాక్టర్ అశోక్ కుమార్‌లు సంయుక్తంగా విశాఖ ఉక్కు కర్మాగారం ప్రాజెక్టు డైరెక్టర్, ఆపరేషన్స్ అదనపు ఛార్జ్ డైరెక్టర్ ఎకె బాగ్చి కు ప్రత్యేక జ్ఞాపిక అందచేశారు. ఈ సందర్భంగా ఎకె బాగ్చి మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం సమాజ శ్రేయస్సు కోసం ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకి ఉపయోగపడే కార్యక్రమాలు చేస్తోందని, ఇటువంటి ఒక ఉదాత్తమమైన కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ 5 బ్యాటరీతో నడిచే కార్లు ఆసుపత్రిలో పేదలు, వృద్ధులు, వికలాంగులు, గాయపడినవారు, గర్భిణీ స్త్రీలు, తల్లి, బిడ్డ ఇతర నిరుపేదలు కేజీహెచ్ ఆవరణలో అంటే క్యాజువాలిటీ నుంచి వివిధ వార్డుకు సంబంధిత విభాగాలు/వార్డులు/ల్యాబ్‌లు/డయాగ్నస్టిక్ సెంటర్లు మొదలైన వాటికి నిర్దేశించిన వైద్య ప్రక్రియ ప్రకారం. 3- షిఫ్ట్‌లు, జనరల్ షిఫ్ట్‌లలో రోగులు, వారి అటెండెంట్ల రవాణాకు బాగా సహాయపడతాయి విశాఖపట్నం మరియు ఆంధ్రప్రదేశ్ మరియు పొరుగు రాష్ట్రాలైన ఒరిస్సా మరియు ఛత్తీస్‌గఢ్ జిల్లాల నుండి ప్రతిరోజూ సుమారు 2,000 మంది రోగులు చికిత్స నిమిత్తం వస్తుంటారు. ప్రతిరోజూ దాదాపు 1475 మంది రోగులు 27 ఎకరాల విస్తీర్ణంలో వివిధ ప్రాంతాలలో విస్తరించి ఉన్న యొక్క వివిధ వార్డులు, సూపర్ స్పెషాలిటీ సౌకర్యాలు, ప్రయోగశాలలు మొదలైన వాటికి ఆరోగ్య సంబంధమైన సహాయానికి ఈ వాహనాలు ఉపయోగపడ తాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్రా వైద్య కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చి రాజు, కేజీహెచ్ ఏడీ శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి జూన్ 6వ తేదీ వరకు
పేలుడు పదార్థాల తయారీ, ఉపయోగించడం నిషిద్ధం

అనకాపల్లి ప్రతినిధి, మే 23, మేజర్‌న్యూస్: ఈనెల 24వ తేదీ నుండి వచ్చేనెల 6వ తేదీ వరకు జిల్లాలో ఎటువంటి పేలుడు సామగ్రి, పదార్థాలు తయారు చేయడం, అమ్మడం, వాటిని ఉపయోగించడం పై నిషేదం విధించినట్లు అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని పేలుడు పదార్థాల తయారీదార్లు, పెట్రోల్ కంపెనీల సేల్స్ మేనేజర్లతో నిర్వహిం చిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తయారీదారులు ఎటువంటి పేలుడు పదార్థాలను తయారు చేయరాదని, దానికి సంబంధించిన సామగ్రి, తయారు చేసి న వస్తువులు అమ్మకూడదని చెప్పారు. పేలుడు పదార్థాలను ఎవరు ఉపయో గించినా వారిపై 13 ఎక్స్ ప్లోసింగ్ యాక్ట్ ప్రకారం తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డి.ఎస్.పి. నర్సీపట్నం డి.ఆర్.ఆర్. మోహన్ జిల్లా అగ్నిమాపకాధికారి ఆర్.వి.రమణ జిల్లాలోని పెట్రోల్ కంపెనీల సేల్స్ మేనేజర్లు, పేలుడు పదార్థాల వినియోగదార్లు, తయారీదార్లు పాల్గొన్నారు.

15 రోజుల్లో మూడు చోరీలు

-తమిళనాడుకు చెందిన ఇద్దరి అరెస్టు
-ఆరు ల్యాప్ టాప్‌లు, మూడు మొబైళ్లు స్వాధీనం
: ద్వారకా క్రైం సీఐ శ్రీనివాసరావు

విశాఖపట్నం, మే 23, మేజర్‌న్యూస్: చోరీ కేసులో నిందితుల నుంచి ఆరు ల్యాప్ టాప్‌లు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ద్వారకా జోన్ క్రైం సీఐ సీహెచ్. శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమిళనాడుకి చెందిన గణేష్ శంకర్, మంజునాథన్ అనే యువకులు మహా రాష్ట్రతో పాటు విశాఖలోనూ పలు చోట్ల చోరీలకు అలవాటు పడ్డారన్నారు. చోరీ చేసే వస్తు సామగ్రిని బయట మార్కెట్‌లో అమ్మేసి వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తుంటారన్నారు. వారిద్దరూ 2021 నుంచి నేరాలు మొదలెట్టారని, కేవలం 15రోజుల వ్యవధిలో విశాఖ పరిధిలో మూడు చోరీలు చేశారన్నారు. భీమిలి, ఆనందపురం స్టేషన్లలో కూడా వీరిపై ఇప్పటికే చోరీ కేసులు నమోదయ్యాయని గుర్తు చేశారు. వెంకోజీపాలెం జంక్షన్ వీరు అనుమానాస్పందంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించామని, ఆరా తీయగా విషయం బయటపడిరదని సీఐ స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే గణేష్ శంకర్‌కి భార్య, నలుగురు పిల్లలున్నారని, ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడని చెప్పారు. మీడియా సమావేశంలో ఎంవీపీ క్రైం ఎస్ఐ ఎన్.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపుకు సహకరించండి

పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్

అరకులోయ, మే 23, మేజర్‌న్యూస్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుకు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఏజెంట్లు సహకరించాలని అరకులోయ ఎస్టీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ మిగతా 2లో

ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

అనకాపల్లి ప్రతినిధి, మే 23, మేజర్‌న్యూస్: జూన్ 4వ లేదీన అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఒట్ల లెక్కింపు సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు పూర్తి సహాయ సహకారాలను అందిచాలని జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్ శెట్టి కోరారు. గురువారం కలెక్టరు కార్యాలయంలో ఈ విషయమై అనకాపల్లి పార్లమెంటు, జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల లో పోటీలో వున్న అభ్యర్థులు, వారి ఏజెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె.వి.మురళీ కృష్ణతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ జిల్లాలో గల అన్ని నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఫ్యూచర్ వరల్డ్ స్కూల్ లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పార్లమెంటు నియోజకవర్గంలో భాగమైన పెందుర్తి నియోజకవర్గం ఓట్ల లెక్కింపు విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ లో జరుగుతుందన్నారు. కౌంటింగ్ హాల్ లోనికి ప్రవేశం, అసెంబ్లీ, పార్లమెంట్ టేబుళ్ల అమరిక మొదలైనవి అభ్యర్థులు, ఏజెంట్లు ముందుగా పరిశీలించుకోవచ్చని తెలిపారు. నిర్ణీత సమయాల్లో వారు వచ్చి ఏర్పాట్లను, రాక, పోకలనుగూర్చి తెలుసుకోవచ్చని చెప్పారు. కౌంటింగ్ కు హాజరయ్యే ఏజెంట్లు తప్పని సరిగా పాస్ లు తీసుకోవాలన్నారు. సెల్ ఫోన్‌లను మిగతా 2లో

ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించిన జిల్లా కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, మే 23, మేజర్‌న్యూస్: ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహణకు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మూడంచెల భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున పేర్కొన్నారు. నిర్ణీత సమయంలోగా ఫలితాలను వెల్లడించేందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రణాళికాయుత చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గురువారం ఉదయం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కౌంటింగ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, ఇతర అంశాలపై సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్, ఎంసీసీ నోడల్ అధికారి సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ లో భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి జిల్లాలో చేపట్టిన చర్యలను జిల్లా ఎన్నికల అధికారి సీతంపోకు జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లికార్జున వివరించారు. స్ట్రాంగ్ రూమ్ ల వద్ద పటిష్ట భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని, మూడంచెల మిగతా 2లో

సింహాచల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

(మొదటి పేజీ తరువాయి)

పౌర్ణమి ఉత్సవం సందర్భంగా ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. వరాహ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు సింహాచలం ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు.

అన్నదానానికి మించిన
దానం మరొకటి లేనేలేదు
: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

విశాఖపట్నం, మే 23, మేజర్‌న్యూస్: అన్నదానానికి మించిన దానం ఇలలో మరొకటి లేదని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు,శ్రీ వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం మధ్యాహ్నం రైల్వే న్యూ కోలని శ్రీ షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం ఆవరణలో నాలుగు వందల మందికి ప్రత్యేకంగా వివిధ వంటకాలతో ఏర్పాటు మాహాన్నదాన కార్యక్రమానికి సీతారాం,ధనలక్ష్మి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై వారి చేతులు మీదుగా ప్రారంభించారు,అంతకు ముందు ఆలయంలో సీతారాం దంపతులు షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు,పూజలు నిర్వహించారు,వీరికి పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం గొండు సీతారాం మాట్లాడుతూ అకుంఠిత దీక్ష,సమయ పాలన,క్రమశిక్షణతో నిత్యం ఎనలేని ఎన్నో సేవా కార్యక్రమాలు ప్రణాళిక యుతంగా నిర్వహిస్తూ వస్తోన్న శ్రీ షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం పాలక వర్గ సభ్యులను అభినందించాల్సిందేనని అన్నారు,ఇదే స్ఫూర్తితో బడుగు,బలహీన వర్గాల పిల్లల ఇతోధిక అభివృద్ధికి చేయూత నందించాలని కోరారు,ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు నూకల శేషగిరి రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ అవగాహన
కార్యక్రమాలలో బీచ్ వీధి వర్తకులు

విశాఖపట్నం, మే 23, మేజర్‌న్యూస్: మహా విశాఖ సముద్ర తీర పరిశుభ్రతకు మేము సైతం అంటూ విశాఖ నగర బీచ్ వీధి వర్తకుల సంక్షేమ సంఘం స్వచ్ఛందంగా సహకారమందించడం అభినందనీయమని జివిఎంసి 3వ జోన్ వైద్య, ఆరోగ్య సహాయక అధికారి బి.ప్రసాద్ రావు పేర్కొన్నారు. గురువారం ఆయన జివిఎంసి కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు విశాఖ కోస్టల్ బ్యాటరీ నుండి పార్కు హోటల్ వరకు ఉన్న వీధి వర్తకులతో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కార్యక్రమాలు బీచ్ రోడ్డు అన్నమయ్య పార్కు ప్రాంతం లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.ఎం.ఒ.హెచ్ బి.ప్రసాదరావు మాట్లాడుతూ విశాఖ సముద్ర తీర ప్రాంతం మన నగరానికి ప్రకృతి వరమని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తీర ప్రాంతంలోని వీధి వ్యాపారులు విశాఖ స్వచ్ఛతకు మేము సైతం అంటూ విశాఖ స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాలలో పాల్గొనడం అభినందనీయమని, అందుకు వారికి సముద్ర తీర ప్రాంత పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. సుందర విశాఖ నగరానికి నిత్యం పర్యాటకులు, సందర్శకులు సందర్శిస్తున్నందున వారందరికీ ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంలో బీచ్ వీధి వర్తకుల వారి బాధ్యతగా భావించి బీచ్ తీరం లో వ్యర్థాలు పడవేయకుండా సందర్శకులకు అవగాహన కల్పించాలని వారికి సూచిం చడమైన దని ఎ.ఎం.ఒ.హెచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహావిశాఖ నగరపాలకసంస్థ వైద్య ఆరోగ్య శాఖ నుండి శానిటరీ సూపర్ వైసర్. సత్యనారా యణ, శానిటరీ ఇన్స్పెక్టర్ గోవింద్, విశాఖనగర బీచ్ వీధివర్తకుల సంక్షేమ సంఘం నుండి .రమణ, గిదితురు శ్రీను, తెడ్డు శంకరరావు తదితర వీధి వర్తకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్‌లతో
రెవెన్యూ, పోలీసు అధికారులు సమావేశం

బొబ్బిలి, మే 23, మేజర్‌న్యూస్: మండలం లోని అలజంగి గ్రామంలో ట్రాక్టర్ ఓనర్స్ మరియు డ్రైవర్లతో పాత సచివాలయ భవనంలో ఇసుక అక్రమ రవాణాపై అవగాహన గురువారం సదస్సు నిర్వహించడం జరిగింది. ఇసుక రవాణాకు ఎవ్వరికీ ఎటువంటి అనుమతులు లేవని అక్రమరవాణా చేస్తే ఎదురయ్యే పరిణామాలను గూర్చి వారికి అవగాహనా కల్పించడం జరిగింది. అలాగే ఎవరైనా అక్రమంగా ఇసుకను తరించినట్లైనా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడం. జరిగింది. ఈ కార్యక్రమం లో ఎస్ఇబి ఎస్సిఐ తిరుమలరావు, ఆర్ఐ కళ్యాణ చక్రవర్తి గ్రామ రెవెన్యూ అధికారి పాల్గొన్నారు.

బొబ్బిలిలో గంజాయి బ్యాచ్ హల్చల్
- ఎగ్జిబిషన్‌కు వచ్చిన కుటుంబం పై దాడి
- ఆసుపత్రిలో బాధితులకు చికిత్స

బొబ్బిలి, మే 23, మేజర్‌న్యూస్: బొబ్బిలి ఫ్లై-ఓవర్ డౌన్, ఆంజనేయ స్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ వద్ద బుధవారం రాత్రి గంజాయి బాబులు హల్చల్ చేశారు. ఎగ్జిబిషన్‌లో అసభ్యంగా ప్రవర్తిస్తున్న వారిని వారించిన కుటుంబంపై భౌతిక దాడికి పాల్పడ్డారు. మహిళలు, చిన్నారులు అనే విచక్షణ లేకుండా అందరిపై దాడి చేసి గాయపరిచారు. ఎగ్జిబిషన్ వారు వారించకుండా ప్రేక్షకపాత్ర వహించడంతో, పోలీసులను ఆశ్రయించిన బాధితులు.పోలీసులు రంగప్రవేశం చేసేలోపు అక్కడ నుంచి గంజాయి బ్యాచ్ పరారయ్యారు. దిక్కుతోచని బాధిత మహిళలు, చిన్నారులు తమ కుటుంబంతో సహా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందారు.. పోలీసు వారు బాధితుల వద్ద నుండి ఫిర్యాదు సేకరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రుతు పవనాలకు ముందే తుఫాన్

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ ల మధ్య తీరం దాటే అవకాశం ఉందని ఆమె వెల్లడించారు. అయితే అల్పపీడనం ప్రభావం ఏపీకి పెద్దగా ఉండకపోవచ్చని స్పష్టం చేశారు. సముద్రంలోకి వెళ్లొద్దంటూ హెచ్చరికలు అల్పపీడనం తుపానుగా మారాక గంటకు 102 కిలోమీటర్ల వరకు వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. మే 27వ తేదీ వరకు ఒడిశా, పశ్చిమబెంగాల్, ఈశాన్య రాష్ట్రాల వారు చేపల వేట, ఇతర ఏ పనులపైనా సముద్రంలోకి వెళ్లవద్దని స్పష్టం చేసింది. ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులు వెంటనే తీరానికి చేరుకోవాలని సూచించింది. పశ్చిమబెంగాల్, ఒడిశాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ తుపాను ప్రభావంతో ఉత్తర ఒడిశా, పశ్చిమబెంగాల్, మిజోరం, త్రిపుర, మణిపూర్ రాష్ట్రాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వివరించింది. అయితే మిగతా తీర ప్రాంత రాష్ట్రాలపై ప్రభావం తక్కువగానే ఉంటుందని పేర్కొంది.

తీవ్ర తుఫాన్‌గా ఎందుకు మారుతుందంటే...!

బంగాళాఖాతంలోని ప్రస్తుత అల్పపీడనం కచ్చితంగా తీవ్ర తుపానుగా ఎందుకు మారుతుందన్న దానిపై ఐఎండీ సీనియర్ శాస్త్రవేత్త డీఎస్ పాయ్, కేంద్ర భూవైజ్ఞానిక శాఖ మాజీ కార్యదర్శి మాధవన్ రాజీవన్ పలు వివరాలు వెల్లడించారు. సాధారణంగా అల్పపీడనం ఏర్పడినప్పుడు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 27 డిగ్రీలు, అంతకన్నా ఎక్కువగా ఉంటే అది తుపానుగా మారుతుంది. ప్రస్తుతం బంగాళాఖాతంలో నీటి ఉపరితల ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. అంటే అల్పపీడనం అత్యంత సులువుగా, కచ్చితంగా తీవ్ర తుపానుగా మారుతుంది.

ఓట్ల లెక్కింపుకు సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లతో ప్రత్యేకంగా గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలన్నీ తమ వంతు సహకారం అందించాలన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు వచ్చేనెల నాల్గవ తేదీన ఓట్ల లెక్కింపు కార్యక్రమంతో పాటు ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపోటములపై ఫలితాల ప్రకటన ఉంటుందని ఆయన తెలిపారు. ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ప్రశాంత వాతావరణంలో ముగిసేలా సహకరించి గిరిజన ప్రాంతం వివిధ ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచేలా చూడాల్సిన బాధ్యత ఈ ప్రాంత వాసులపై ఉందన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ దఫా జరిగిన ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగిందని ఆయన చెప్పారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా ముందుగా పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ను చేపడుతామన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్ నుంచి తరలించిన అనంతరం ఓట్ల లెక్కింపు కార్యక్రమం మొదలుపెడతామని ఆయన తెలిపారు. కౌంటింగ్ సెంటర్ కు విచ్చేసే ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేస్తామని రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏ ఎస్ పి ధీరజ్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువబడుతున్న నేపథ్యంలో నియోజకవర్గంలో ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు.

ఎన్నికల సంఘం తాజాగా జారీ చేసిన కీలక ఆదేశాల మేరకు బాణసంచా విక్రయాలు, కాల్చాడాలు, ఎన్నికల్లో విజేతగా నిలిచిన అభ్యర్థుల ఊరేగింపులు, ప్రదర్శనలు, మైకుల ద్వారా ప్రచారం తదితర వంటి కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. ఎవరైనా ఈ ఆంక్షలు ఉల్లంఘిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అల్లూరి సీతారామరాజు జిల్లా ఏ ఎస్ పి ధీరజ్ హెచ్చరించారు.ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. సీసీ కెమెరాలతో పాటు సి ఆర్ పి ఎఫ్ జవాన్ల భద్రత ఉంటుందన్నారు. జిల్లాలోని పలు ఎస్టీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్ డి సి టి డబ్ల్యూ) వివిఎస్ శర్మ, స్థానిక అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు సుధాకర్,సోమేశ్వరరావు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంలోనికి తీసుకు వెళ్లరాదని కనుక తమ సెల్ ఫోన్ లు తీసుకురావద్దని చెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధిత ఆర్వోలు, ఎంపీ నియోజకవర్గానికి డి.ఆర్.ఓ. పాస్ లు మంజూరు చేస్తారని చెప్పారు. పోలీసు సూపరిటెండెంట్ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ మన జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, అందరూ సంయమనం పాటించినందుకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా కౌంటింగ్ ప్రక్రియ కూడా ప్రశాంతంగా జరిగేందుకు అన్ని పార్టీల వారు సహకరించాలన్నారు. ఎలక్షన్ కమిషన్ మార్గద ర్శకాలను అనుసరించి సుహృద్భావ వాతావరణంలో ఎటువంటి ఘర్షణలకు, హింసకు తావివ్వకుండా ఇతరుల భావోద్వేగాలను ప్రేరేపించకుండా చట్టాలను గౌరవిస్తూ, నిబంధనకు కట్టుబడి జిల్లాలో మొత్తం ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా జరగాలన్నారు. ఒకటవ తేదీ నుండి టీవీలలో ఎగ్జిట్ పోల్స్ ప్రసారమవుతాయని, ఆరోజు నుండి శాంతి భద్రతల పర్యవేక్షణకు ఫ్లాగ్ మార్చ్ లు నిర్వహించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద త్రీటైర్ భద్రత వుం టుందని, మొబైల్ ఫోన్ లు ఎవరికీ అనుమతించ బడవని చెప్పారు. కౌంటింగ్ హాలులో క్రమశిక్షణతో ఉండాలన్నారు. పికెట్లు, చెక్ పోస్టులు మరింత కట్టుదిట్టం చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, ఆర్డీవోలు ఎ.చిన్నిక్ష్ణ, హెచ్.వి.జయరామ్, ఆర్.వోలు మనోరమ, గీతాంజలి, సత్యవాణి, అనకాపల్లి పార్లమెంటు, జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, వారి ఏజెంట్లు పాల్గొన్నారు.

అనకాపల్లిలో 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్

(మొదటి పేజీ తరువాయి)

జరిగిందని, ప్రశాంత వాతావరణంలో ప్రజాజీవనం జరిగేలా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు గొడవలు సృష్టించే వ్యక్తుల పట్ల చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని, ప్రజలకు అవగాహన కల్పించేందుకు అనకాపల్లి టౌన్ ఫోర్ రోడ్ జంక్షన్ లో ఈ మాక్ డ్రిల్ చేయడం జరిగిందన్నారు. మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ లో పాల్గొన్న పోలీస్ సిబ్బంది, ఫైర్ సర్వీస్ అధికారి నర్సింగరావు, సిబ్బందినీ అభినందించామని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి. సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్, ఎస్.బి డీఎస్పీ అప్పారావు, దిశా డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు, ట్రైనీ డీఎస్పీ భవ్య, ఇన్స్పెక్టర్లు మన్మధరావు, సతీష్, శంకరరావు, శ్రీనివాసరావు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

విధానంలో భద్రతా సిబ్బందిని అందుబాటులో ఉంచామని చెప్పారు. కేంద్ర బలగాలతో పాటు సుమారు 500 మంది సివిల్ పోలీసులు భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. 176 సీసీ కెమెరాలు అమర్చామని, వాటిని మానిటరింగ్ రూమ్ కు అనుసంధానం చేసి రోజువారీ పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి ఏయూ పరిధిలో ఏడు హాళ్లు గుర్తించామని, నియోజకవర్గానికి రెండేసి చొప్పున మొత్తం 98 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 140 రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. ఒక్కో టేబుల్ కు గాను ఒక్కో కౌంటింగ్ సూపర్ వైజర్, ఒక్కో కౌంటింగ్ అసిస్టెంటు, ఒక్కో మైక్రో అబ్జర్వర్ను నియమించామని చెప్పారు. పార్లమెంటు పరిధిలోని పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియను మూడు రౌండ్లలో నిర్వహించనున్నామని, దానికి గాను రెండు హాళ్లను గుర్తించామని, 18 టేబుళ్లను కేటాయించామని వివరించారు. 18 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లను, 36 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను, మరొక 18 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని పేర్కొన్నారు. జిల్లాలోని అసెంబ్లీలకు వచ్చేసరికి పార్లమెంటుతో కలిపే అన్ని ఏర్పాట్లు చేశామని అదనంగా పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి మరొక మూడు రౌండ్లు పార్లమెంటు పరిధిలో పెరుగుతాయని స్పష్టం చేశారు.

అసెంబ్లీల పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు గాను ఐదు హాళ్లలో 33 టేబుళ్లు ఏర్పాటు చేశామని, 15 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుందని వెల్లడించారు. 24 మంది అదనపు ఏఆర్వోలు, 33 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లు, 57 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 33 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని జిల్లా కలెక్టర్ వివరించారు. సంబంధిత అధికారులకు, సిబ్బందికి నిర్దిష్ట కాలంలో శిక్షణ అందిస్తామని, ఈ నెల 25న తొలి విడత ర్యాండమైజేషన్, జూన్ 2వ తేదీన రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తామని వివరించారు.

తెర్లాంలో నాగ దేవతకు కర్పూర నీరాజనం

తెర్లాం, మే 23, మేజర్‌న్యూస్: స్థానిక మండల కేంద్రము లో గల పంచ ముఖేశ్వర క్వా లనీ లో వెలసిన నాగ దేవత ఆలయంలో నాగ దేవత కు ఆ గ్రామ మహిళలు గురువారం రాత్రి కర్పూర నీరాజనం పలికారు. పౌర్ణమి సందర్భంగా మహిళలు సామూహికంగా జరగిన నీరాజనం లో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించి ప్రార్థించి వేడుకున్నారు..ప్రతిఏటా జరుపుకొనే ఈ కర్పూర నీరాజనం ద్వారా తమ తమ కోర్కెలు తీరే విధంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచ ముఖీశ్వ ర క్వా లని వాసి మహిళలు తో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల మహిళలు కూడా పాల్గొన్నారు.

వెలగపూడిని కలిసిన తెదేపా నాయకులు
ముందుగా వెలగపూడికి శుభాకాంక్షలు :బుడుమూరి

ఆరిలోవ, మే 23, మేజర్‌న్యూస్: విశాఖ తూర్పునియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబుని 9 వ వార్డు నాయకులు, విశాఖ పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు, 9వ వార్డు టిడిపి ఇంచార్జి బుడుమూరి గోవింద్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికల సమరంలో విజయం మనదేనాని ముందుగానే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో విశాఖ పార్లమెంట్ ఆర్గనైగింగ్ సెక్రటరీ ఒమ్మి పోలరావు, 9వ వార్డు ప్రధాన కార్యదర్శి గెడ్డవలస వెంకట్రావు, తూర్పునియోజకవర్గం ఐదీపీ అధ్యక్షులు బాదరు బాలరాజు, హిల్ ఏరియా ఇంచార్జ్ ఒమ్మి రాజు తదితరులు పాల్గొన్నారు.

పలు ఆలయాలు సందర్శించిన
వాసుపల్లి దంపతులు..

విశాఖపట్నం, మే 23, మేజర్‌న్యూస్: వైశాఖి పౌర్ణమి సందర్భంగా దక్షిణ నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్, ఉషారాణి దంపతులు గురువారం ఉదయం పలు ఆలయాలు సందర్శించారు. ముఖ్యంగా పౌర్ణమి రోజున విశిష్టత కలిగిన సత్యనారాయణ స్వామి నీ సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ముమ్మారు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే శ్రీ జగన్నాథ స్వామి వారి దేవాలయంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి కల్యాణోత్సవం లో భాగంగా ఈ రోజు వైశాక పూర్ణిమ రోజున స్వామివారి చక్రవారోత్సవము లో శ్రీ వాసుపల్లి గణేష్ కుమార్ సతీ సమేతంగా పాల్గొని పూజలు చేశారు. అనంతరం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని దంపతలిద్దరూ స్వహస్తాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. గురువారం పౌర్ణమి రోజున ప్రత్యేకంగా 34 వార్డులో శ్రీ సాయిబాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

షిర్డీ సాయిబాబా సన్నిధిలో
వంశీకృష్ణ శ్రీనివాస్, పద్మజ దంపతులు

విశాఖపట్నం, మే 23, మేజర్‌న్యూస్: మహారాష్ట్రలో ప్రముఖ పుణ్యక్షేత్రం షిరిడీ సాయిబాబా వారి ఆలయాన్ని జనసేన విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజక వర్గం కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం సందర్శించారు. ఆలయంలో సాయిబాబాని దర్శించుకొని, ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాకి ఇష్టమైన నైవేద్యాన్ని సమర్పించారు. స్వామి వారి సేవలో పాల్గొనడం అదృష్టం గా భావిస్తున్నానని ఈ సందర్భంగా వంశీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సునీల్, రఘు పాల్గొన్నారు.

'సూపర్‌మామ్' అందర్నీ అలరిస్తుంది!

విశాఖపట్నం, మే 23, మేజర్‌న్యూస్: ఈ నెల 25న బీచ్ రోడ్డులోని మెరైన్ పార్క్ ఎగ్జిబిషన్‌లో నిర్వహించనున్న 'మై సూపర్ మామ్ ఈవెంట్' అందర్నీ అలరించనుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. కాబీ ఆప్ ద్వారా ఈవెంట్‌కు హాజరయ్యే ప్రతి ఒక్కరికీ మొదటి రైడ్ ఉచితంగా అందిస్తున్నామని సీవోవో కుమార్ తెలిపారు. ఆ కార్యక్రమంలో తల్లితో కలిసి ర్యాంప్ వాక్, డ్యాన్స్ విత్ మామ్, మాంబోల, ఫన్ గేమ్స్ ఉంటాయని హరి తెలిపారు. క్వాంటమ్ డయాగ్నొస్టిక్ సంస్థ హెల్త్ పార్టనర్‌గా వ్యవహరిస్తున్న ఈ కార్యక్రమం ప్రతి ఒక్కర్నీ అలరిస్తుందన్నారు. అలాగే 30సెకెన్లలో 'ఐయాం సూపర్ మామ్' అనే పోటీ కూడా వీడియో రూపంలో చేయడం వినూత్నంగా ఉంటుందని టీవీ ఫేమ్, ఇన్‌స్టాగ్రాం స్టార్ మౌనిక చెప్పుకొచ్చారు. ఆసక్తి ఉన్న వారు 9052461120 ఫోన్ నంబర్ ద్వారా ఎంట్రీ పాసుల్ని ఉచితంగా పొందొచ్చని ఈవెంట్ మేనేజర్ వీరూమామా ఓ ప్రకటనలో తెలిపారు.

ఓట్ల లెక్కింపు నిబద్ధతతో, నిర్భంగా చేయాలి
జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

అనకాపల్లి ప్రతినిధి, మే 23, మేజర్‌న్యూస్: జూన్ 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు నిబద్ధతతో, నిర్భంగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి ఆదేశించారు. గురువారం కలెక్టరు కార్యాలయంలో మాస్టర్ ట్రయినీలకు ఈవీఎం లు, పోస్టల్ బ్యాలట్ లెక్కింపు పై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శిక్షణలో ప్రతి చిన్న విషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మాన్యువల్ లో సూచించిన ప్రకారం ఓటు చెల్లుబాటును గుర్తించ వలసి వుంటుందన్నారు. ముందుగా ఈవీయం ను పరిశీలించి పోలయిన ఓట్లను సరిచూడాలన్నారు. తరువాత సాంకేతిక పరమైన అంశాలను సరిచూసి ఆపై లెక్కింపుకు వెళ్లాలన్నారు. ఎటువంటి తడబాటుకు అవకాశమీయరాదన్నారు. పోస్టల్ బ్యాలట్ లెక్కింపు, ఈవీఎం ల లెక్కింపు పైన కూడా అందరికీ పూర్తి శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షకులు చెప్పిన విషయాలను క్షుణ్ణంగా ఆకలింపు చేసుకోవాలన్నారు. చిన్న పొరపాటుకు కూడా అవకాశమియ్యరాదన్నారు. నియమ నిబంధనలను పూర్తిగా అర్థం చేసుకోవాల న్నారు. ప్రశాంత చిత్తంతో వున్నట్లయితే ఎటువంటి పొరపాటు జరుగదని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, సిపిఓ జి.రామారావు, నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి.జయరామ్, సివిల్ సప్లైస్ డి.యం. పి.జయంతి, డిల్.ఎల్.డి.ఓ. నాగలక్ష్మి, డి.ఎల్.పి.వో. కుమార్, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ డి.రామమూర్తి, డిటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీఅనగాదేవి సహిత జైగురుదత్త హోమంలు

- భక్తులకు అన్నసమారాధన కార్యక్రమము
- పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి, మే 23, మేజర్‌న్యూస్: మండల కేంద్రంలోని శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో గురువారము శ్రీఅనగాదేవి సహిత జైగురుదత్త హోమములు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమేరకు ఉదయం సుప్రభాత సేవ, కాకడ హారతి, తదితర పూజ కార్యక్రమాలు జరి గాయి. అదేవిధంగా శ్రీషిరిడి సాయిబాబాకు విశేష అర్చనలు అభిషేకములు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంకు చెందిన ప్రముఖ యజ్ఞయాగకర్త, అసంఖ్యాక దేవాలయాల ప్రతిష్టాపకులు ఎస్ వి ఎల్ ఎన్ శర్మయాజి సంపూర్ణ సహాయ సహకారా లతో శ్రీఅనగాదేవి సహిత జైగురుదత్త హోమములను నిర్వహించారు. అదే విధము గా ఈహోమములు చేయిం చు కోవడంవల్ల ఈతి బాధలు తొలగడంతో పాటు మనసులో కోరిన కోర్కెలు నెరవేరుతాయ ని తెలిపారు. ఆలయ అర్చకులు నల్లకాంతం శ్రీనువాస రావు శ్రీఅనగాదేవి సహిత జైగురుదత్త హోమములను నిర్వహించ డం జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈహోమంలో కార్యక్రమంలో పాల్గొన్న దంపతులకు దీక్షవస్త్రములను కమిటీ సభ్యులు అందజేశారు. అలాగే దాతలచే అన్నదానం కార్యక్రమమును నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల్లో పాలకొండ, కురుపాం, జె కె పూర్ , వీరఘట్టం, కొత్తపల్లి, తదితర ప్రాంతాలకు చెందిన భక్తుడు పాల్గొన్నారు. ఈమేరకు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఉచిత ప్రసాదములను అందజేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వ హించారు.

వన్యప్రాణుల గణన సక్రమంగా చేయాలి : డి ఎఫ్ ఓ

పార్వతిపురం రూరల్, మే 23, మేజర్‌న్యూస్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు చేపట్టిన వన్యప్రాణుల గణన ప్రక్రియ సక్రమంగా సజావుగా పూర్తి చేయాలని, ఈ గణన వన్యప్రాణుల సంరక్షణకు ఎంతో కీలకమని మన్యం జిల్లా డీఎఫ్ఓ ప్రసూనకుమారి అన్నారు. మూడు రోజులపాటు జిల్లాలో వన్యప్రాన్ల గణన ప్రక్రియ జరగనుంది. ఇందులో భాగంగా తొలి రోజు గురువారం డివిజన్లో గల అటవీ ప్రాంతంలో అటవీశాఖ రేంజర్ రాజు పరివేక్షణలో సిబ్బంది వన్యప్రాణుల లెక్కించే పనిలో పడ్డారు. ముఖ్యంగా కొమరడ తో పాటు సమీపంలో గల ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల్లో సంచరిస్తున్న వన్య ప్రాణుల యొక్క స్థితిగతులను తెలుసుకుంటున్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఉన్న వన్యప్రాణుల సంఖ్య పెరిగిందా లేదా తగ్గిందా అన్న దానిపై తుది నివేదికను ప్రభుత్వానికి ఇవ్వనున్నట్లు రేంజర్ తెలిపారు. ఈ ప్రాంతం యొక్క భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అనేకవర్యప్రాణులు గతంలో జీవనం సాగించేది అయితే చాలా వరకు గిరిజనులు అడవులను నరికి వేయడంతో కొంతవరకు వన్యప్రాన్ లెక్క సంఖ్య తగ్గిందనే చెప్పాలి. ఇది ఇలా ఉంటే ఈ వన్యప్రాన్ల గణన లలో ప్రధానంగా పులులు, సింహాలు, ఏనుగులు తోపాటు అడవుల్లో సంచరించే కొన్ని రకాల జీవులను పరిగణలోకి తీసుకొని గణన చేస్తున్నారు. మూడు రోజులు జరిగే ఈ గణనలో సిబ్బంది కూడా పాల్గొని సేవలు అందిస్తున్నారు. రేంజర్ తో పాటు ఫారెస్ట్ సత్యనారాయణ బీటధికారులు, వాచర్లు ఉన్నారు.

నలుగురికి ప్రాణం పోసిన సుశీల చిరంజీవి

- అవయవ దానంతో మరికొందరి జీవితాల్లో వెలుగు
- తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్

శ్రీకాకుళం, మే 23, మేజర్‌న్యూస్: అవయువదానంతో సుశీల మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపారని నియోజకవర్గం తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతిశంకర్ అన్నారు. గార మండలం కె. మత్స్యలేశం పంచాయితీ వాడపాలెం గ్రామానికి చెందిన పప్పు గోవింద కుమార్తె పప్పు సుశీల ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని స్వాతి శంకర్ గురువారం పరామర్శించారు. సుశీల మరణం పట్ల విచారాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. సుశీల మరణానంతరం అవయువదానం చేసారని తెలుసుకుని వారిని అభినందించారు. సుశీల భౌతికంగా మన మద్య లేకపోయినా అవయువదానంతో చిరంజీవిగా నిలిచారని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, భగవంతుడు ఆమె కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని స్వాతి శంకర్ ఆకాంక్షించారు.

వజ్రకవచన ధారణలో శ్రీనివాసులు

నరసన్నపేట, మే 23, మేజర్‌న్యూస్: నరసన్నపేట పట్టణంలోని పురాతన శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీనివాసుని వజ్రకవచ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

గ్రంధాలయంలో బుక్ రీడింగ్ కార్యక్రమం

గొలుగొండ, మే 23, మేజర్‌న్యూస్: గొలుగొండ శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా గ్రంధాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో గురువారం బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధమ శ్రేణి గ్రంథ పాలకుడు మురళీకృష్ణ గ్రంథాలయాలు ప్రయోజనాలు గురించి వివరించారు. అలాగే ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం నీతి కథలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

- గ్రంధాలయ నిర్వాహకులు మధుసూదనరావు
- విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహణ

గరుగుబిల్లి, మే 23, మేజర్‌న్యూస్: మండల కేంద్రంలోని శాఖా గ్రంధాలయంలో నిర్వ హిస్తున్న వేసవి విజ్ఞానశిబిరం కొనసాగుతోంది. ఈకార్యక్రమం లో భాగంగా విద్యార్థులకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈమేరకు స్టోరీ టెల్లింగ్ లో భాగముగా గురువారం గురజాడ అప్పారావు జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు చదివి వినిపించారు. అదేవిధంగా క్రీడా పోటీల్లో భాగంగా చదరంగం క్యారం బోర్డు తదితర ఆటల పోటీలను నిర్వహిం చామని శాఖా గ్రంధాలయం నిర్వాహకులు నల్ల మధుసూద నరావు తెలిపారు. అదేవిధం గా ప్రతిరోజు వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహిం చడం జరుగుతుందని ఈ సందర్భంగా మధుసూద నరావు పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈవేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల గల పిల్లల్ని గుర్తింపు

217 మందిని గుర్తింపు జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్ కుమార్

వంగర, మే 23, మేజర్‌న్యూస్: విజయనగరం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను 217 మందిని గుర్తించి నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్ తెలిపారు. గురువారం ఈ ప్రత్యేక కార్యక్రమంలో పిల్లల గుర్తింపు చేసిన వారిని ఆయన పరిశీలించారు. ప్రతి గ్రామంలోని 0 నుంచి 18సంవత్సరాలు వయస్సు గల ప్రత్యేక అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల తో పిల్లలను గుర్తించి వారికి విద్యా బోధనతోపాటు ఫిజియో థెరఫీ చేయించడం, అంధులు, చెవిటి, మూగ పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం కోసం భవిత కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో మండల విద్యాశాఖాధికారులు ఐఆర్ఈ టీచర్లు సర్వే చేస్తున్నారని , మరో పది రోజుల పాటు సర్వే జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తిస్తున్న వారిని తాను పరిశీలిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్ చెప్పారు. ప్రత్యేక అవసరాల కోసం పిల్లలకు అన్ని సదుపాయాలు కల్పిస్థారని, ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారికి విద్యా బోధనతోపాటు ఫిజియో థెరఫీ చేయించడం, అంధులు, చెవిటి, మూగ పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం కోసం భవిత కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఈరోజు ఉదయం అరసాడ గ్రామంలో డోర్ టు డోర్ సర్వే కార్యక్రమంలో పాల్గొని డి .హేమలత,మానసిక వైకల్యం విద్యార్థిని గుర్తించి జడ్పీహెచ్ఎస్ అరసాడ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించడం జరిగిందన్నా ున్న వివిధ రకాల పథకాలకు అర్హులవుతారని ఎంఈఓ దుర్గారావు పిల్లలు తల్లిదండ్రులకు వివరించారు.. ప్రభుత్వం దివ్యాంగులకు ఎన్నో సంక్షేమ పథకాలుఅమలు చేస్తుందని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తెలియపరిచారు.ప్రతి దివ్యాంగ విద్యార్థి కూడా పాఠశాలలో చేర్పించాలని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయులు వై సంగోజి నాయుడు, లక్ష్యనాయుడు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా జరిగిన 2568వ బుద్ధ జయంతి, వైసాఖ పౌర్ణమి వేడుకలు

శ్రీకాకుళం/నరసన్నపేట, మే 23, మేజర్‌న్యూస్: విశ్వశాంతి ప్రదాత గౌతమ బుద్ధుని జన్మదిన సందర్భంగా 2568 వ బుద్ధ జయంతి, వైశాకపౌర్ణమి వేడుకలకు బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బి.ఎస్.ఐ) శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విజ్ఞాన మందిర్ ఇలిసి పురం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు బోయిడి మురళీ కృష్ణ ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజ్ఞ, శీల, కరుణ అష్టాంగ మార్గాన్ని ప్రభోదించే మహాత్ముడు బుద్దుడు అని ఆయన మార్గం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రజల్లో విస్తృతంగా తీసుకుని వెళ్లి బౌద్ధమత వ్యాప్తిని కృషి చేశారని కొనియాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి మైనార్టీ మత, కులస్తులకు పైన దాడులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. సమానత్వం, రాజ్యాంగం హక్కులను కాలరాసే పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమానికి బి.ఎస్.ఐ జిల్లా అధ్యక్షులు కృష్ణారావు అధ్యక్షత వహించారు.బెందాళం. కృష్ణారావు డాక్టర్ రామారావు, కంఠ వేణు, లాస సోమేశ్వరరావు,చల్ల రామారావు,వాడానా. కృష్ణారావు ,చల్లా రామారావు, బొత్స బుద్దుడు , రామప్పడు, భూపతి , బి.ఎస్ .ఐ మీడియా కన్వీనర్స్ వై చలపతి దండాసి.రాంబాబు(జాన్) తదితరులు పాల్గొన్నారు.

మేకలు, గొర్రెలకు వ్యాధినిరోధక టీకాలు

మాకవరపాలెం, మే 23, మేజర్‌న్యూస్: గొర్రెలు, మేకలకు వేస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ డీడీ నర్సింహులు సూచించారు. మండలంలోని తామరం, యరకన్న పాలెంలో గురువారం జరిగిన టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 15 వరకు గొర్రెలు, మేకలకు టీకాలు వేస్తామని, రైతులు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యా యత్నం

మక్కువ, మే 23, మేజర్‌న్యూస్: వివాహిత ఆత్మహత్యా యత్నం మక్కువ హరిజన వీధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు గురువారం తెలిపిన వివరాలు ఇలావున్నాయి. హరిజన వీధికి చెందిన చుట్ల మాధురి (39) కృష్ణ దంపతులుకి ఇద్దరు పిల్లలు, కృష్ణ మధ్యానికి బానిస కావడంతో తరచూ గొడవలు పడుతున్నారు. ఎప్పటిలాగా కృష్ణ బుధవారం కూడా మద్యం సేవించి రావడంతో మాధురి నిలదీయడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగి పెద్దది కావడంతో అనంతరం క్షనికావేశంలో మాధురి ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించు కోగా కుటుంబీకులు హుటాహుటిన కాలిన మాధురిని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వెళ్లగా ప్రధమ చికిత్సానంతరం పార్వతీపురం ఏరియా హాస్పిటల్కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నం కేజీహేచ్కు తరలించి చికిత్సను అందిస్తున్నారు. స్థానిక యస్సై పి నరసింహామూర్తి నేత్రుత్వంలో కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికుడికి సెల్ ఫోన్ అందజేత అందజేసిన ఆర్టీసీ అధికారులు

విజయనగరం కలెక్టరేట్, మే 23, మేజర్‌న్యూస్: లక్ష్మివారం స్థానిక విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రామకృష్ణ రాజు అనే పాసింజర్ విజయనగరం నుంచి చీపురుపల్లి ప్రయాణం చేశారు , ఈ ప్రయాణంలో తమ వద్ద ఉన్న 15000 విలువచేసే మొబైల్ ఫోన్ బస్సులోని మరిచిపోయి బస్సు దిగిపోయారు, ఆ మొబైల్ ఫోన్ బస్సులో కండక్టర్ గుర్తించి సదరు డిపో డిపో అధికారులకు మొబైల్ ఫోన్ అందజేశారు, సదరు మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న పాసింజర్ వచ్చి అడగగా అతని యొక్క వివరాలు తెలుసుకుని బాధితుడికి మొబైల్ ఫోన్ ఇవ్వడం జరిగింది. ఎంతో విలువైన మొబైల్ ఫోన్ తిరిగి ఇవ్వడంతో ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి ఐ రామారావు ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ సత్యం , ముత్యాలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని ఆటో బండి డీ ఒకరికి తీవ్ర గాయాలు

వంగర, మే 23, మేజర్‌న్యూస్: మండలంలో లక్ష్మింపేట నుండి శివ్వాం గ్రామం వెళ్తుండగా, శివ్వాం, ఎం.సీతా రాంపురం గ్రామాల మద్యలో రోడ్డు పై ఆటో,మోటార్ సైకిల్ డీ కొన్నా యి. డీ కొనగా మోటార్ సైకిల్ మీద నున్నటు వంటి కోడూరు సత్యం నాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి.ఆయన తలపై, మోకాలు పై బలమైన గాయాలయ్యాయి. తల పై, కుడి కాలు ఇరిగి పొగా,తల మీదను పెద్ద గాయాలు కావటంతో విపరీతమైన రక్తం కారి పోయిన వ్యక్తిని వెంటనే రాజాం కేర్ హాస్పటల్ కు తరలించినట్లు ఎస్ ఐ జనార్ధనరావు తెలిపా రు. లక్ష్మింపేట నుండి శివ్వాం లో తమ బందువులు సంబరాలు కు చెప్పగా, గురువారం నాడు బయలు దేరి వెళు ్తండ గా మార్గ మద్యలో ఈ యాక్సిడెంట్ జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ యాక్సిడెంట్లో బలమైన గాయాలు అయ్యాయి.అంతే కాకుండా మోటార్ సైకిల్ డ్రైవింగ్ చేసిన సత్యం నాయుడు మనవుడు అజిత్ కుమార్ కు చిన్న,చిన్నగాయాలైనట్లు ఆయన చెప్పారు. బండిని ఢీకొట్టినఆటో డ్రైవర్ వెంటనే ఫ రారైనట్లు పోలీసులు చెప్పారు. దీనిపై కేసు నమోదుచేసి ఆటో డ్రైవర్ కోసం గాలి స్తున్నట్లు ఎస్ ఐ పేర్కొన్నారు.

రుతుక్రమం పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

ఐ.సి.డి.ఎస్. ఆధ్వర్యంలో నిర్వహణ

విజయనగరం బ్యూరో, మే 23, మేజర్‌న్యూస్: రుతుక్రమం సమయంలో పరిశుభ్రత పై యుక్త వయస్సు బాలికల్లో అవగాహన అవసరమని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంచాలకులు చిన్మయి దేవి అన్నారు. ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా నగరంలోని మహిళా ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిషోరీ బాలికలు, సూపర్ వైజర్ లు, సి.డి.పి.ఓ.లతో గురువారం ఒక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ఉద్దేశించి ఆర్ జె.డి. మాట్లాడారు. ఈ ర్యాలీలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి బి. శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

పబ్లిసిటీ ఫ్లెక్సీని సరిచేసిన అధికారులు

బొబ్బిలి, మే 23, మేజర్‌న్యూస్: బొబ్బిలి పెట్రోల్ బంక్ జంక్షన్ వద్ద,పబ్లిసిటీ ఫ్లెక్సీ ప్రమాదకర పరిస్థితిలో ఉందనే విషయాన్ని గత రాత్రి తెలియజేసిన వెంటనే,బొబ్బిలి డిఎస్పి పి శ్రీనివాసరావు మరియు మున్సిపల్ కమిషనర్ శ్రీమతి ఎల్ రామలక్ష్మి తక్షణమే స్పందించారు. ఈ మేరకు గురువారం ఫ్లెక్సీని సరైన రీతిలో పెట్టవలసిందిగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో,వెంటనే వారు అక్కడికి వెళ్లి,ఫ్లెక్సీ ని సరి చేయడం జరిగింది. వెంటనే తగిన చర్యలు తీసుకోవడంతో, ఎటువంటి ప్రమాదాలు జరగలేదు.

తోటపల్లిలో ముగిసిన వార్షిక కళ్యాణ మహోత్సవములు

- ఈవో వి వి సూర్యనారాయణ
- పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి, మే 23, మేజర్‌న్యూస్: తోటపల్లిలో వేంచేసివున్న శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీకోదండ రామ స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవములు గురువారం తో ముగిశాయి. ఈమేరకు వైశాఖ శుద్ధ ఏకాదశి నుండి వైశాఖ శుద్ధ పౌర్ణమి వరకు అనగా గురువారం వరకు పాంచాణిక దీక్షతో ఆలయ అర్చకులు వి వి అప్పలాచార్యులు ఆధ్వర్యంలో శ్రీకోదండరామస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవములు ఘనంగా నిర్వహించడం జరిగిందని దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వి వి సూర్యనారాయణ వెల్లడించారు. శ్రీకోదండ రామస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవములు సందర్భముగా స్వామి వారికి మరియు అర్చకులకు దీక్ష వస్త్రములను పార్వతీపురంకు చెందిన ఆర్నిపల్లి అర్జునరావు, అలివేలుమంగ దంపతులు సమర్పించారని ఈవో సూర్య నారాయణ పేర్కొన్నారు. అదేవిధంగా చింతల బెలగాముకు చెందిన పొడుగు సంజీవరావు కళ్యాణి దంపతులు పూజా సామాగ్రిని సమర్పించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది గంట శ్రీధర్ నాయుడు, పెడారపు పోలిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎం.కోడూరులో ఘనంగా శ్రీదుర్గాలమ్మ పండుగ

మాడుగుల, మే 23, మేజర్‌న్యూస్: మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామంలో గురువారం గ్రామానికి చెందిన కోల రాము ఆధ్వర్యంలో దుర్గాల అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. సుమారు 50 ఘటాలను తలపై ధరించి శ్రీ దుర్గా అమ్మవారి ప్రతిమను గ్రామంలో ఊరేగించి అనంతరం ఆలయానికి చేరుకొని అమ్మవారికి తమ మొక్కలను ముడుపులను చెల్లించుకున్నారు. ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్ కోటలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

లక్కవరపుకోట, మే 23, మేజర్‌న్యూస్: మండలం లోని ఎల్ కోట మేజర్ పంచాయతీ లో గత రెండురోజులుగా సర్పంచ్ కెఱు పార్వతి కార్యదర్శి ప్రసాద్ ల అద్వర్యం లో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతూన్నాయి డ్రయినేజి లను శుభ్రపరచడం తో పాటు చెత్తసేకరన చేపడుతున్నారు గత కొన్ని రోజులలో కురిసిన వానలకు బి సి కాలనీలోని కాలువల్లో చెత్త పేరుకు పోవడం తో బుధవారం డ్రయిన్లలోని చెత్తను తీసి గురువారం దానిని వ్యాను ద్వారా వేరే చోటుకు తరలించారు .నిత్యం క్రమం తప్పకుండా ఇలా పారిశుధ్య పనులు చేపట్టక పొతే మురుగు నీరు చెత్త కాలువల్లో వీధుల్లో పేరుకు పోయి దోమలు ఈగలు వ్యాపిస్తాయి కనుక క్రమం తప్ప కుండా పారిశుధ్య పనులు చేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

గర్భిణీలు బాలింతాల్లో రక్త హీనత తగ్గించాలి

ఎంపిడిఓ గీతాంజలి

సీతంపేట, మే 23, మేజర్‌న్యూస్: డి అర్ డి ఏ సమావేశ మందిరంలో గురువారంమండల స్థాయి ప్రిషం 10 సమీక్ష సమావేశం జరిగినది.సీతంపేట మండలం లోని మర్రిపాడు, కుసిమి, దోనుబాయ్ వైద్యా ధికారులు, ఎంపిడిఓ గీతాంజలి, సీడిపి ఒ రంగలక్షి గారు, డి అర్ డి ఏ ఏ పి ఎం విజయకుమారి, ఈ ఒ పి అర్ డి సత్యం పాల్గొన్నారు గర్భిణీలు బాలింతలలో రక్తహీనత తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అంగన్వాడీ నుంచి అందుతున్న పోషణ, ఏ ఎన్ ఎం మరియు మహిళా పోలీసులు, విఒఎలు సమన్వయంతో పర్యవేక్షించాలి అని ఎంపిడిఓ ఆదేశించారు.

మండల కేంద్రంలో కానరాని సందడి

లక్కవరపుకోట, మే 23, మేజర్‌న్యూస్: మండల కేంద్రం లో ఎన్నికలు సమయం లోను అంతకు ముందు వున్నా సందడి ఎక్కడా కని పించడం లేదు ఎన్నికలు జరిగిపోయాయి ఫలితాల కోసం నేతలు ఎదురుచూస్తున్నారు ఎంపీపీ ఇతర నేతలు ఎన్నకల్లో కష్టపడ్డారు కనుక ఎంపీడీఓ కార్యాలయానికి రావడం తగ్గించారు దీనితో మిగిలిన నాయకులూ కూడా ఎంపీడీఓ కార్యాలయానికి రావడం తగ్గించేసారు ఎన్నికల ఫలితాలు అందరిని ప్రభావితం చేయబోతున్నాయి కనుక ఎవరు కూడా హుషారుగా కనిపించడం లేదు ఎన్నికల కోడ్ కారణంగా కొత్త కార్యక్రమాలు కొత్త పనులు ఏవి లేక పోవడం తో అధికారులు కూడా కొంత సేద తీరుతున్నారు ప్రజలు కూడా ఎన్నికల టైం కదా అందరు బిజీ గా ఉంటారు లే అని మండల కేంద్రం లో పనులు వాయిదా వేసుకున్నట్లు కనిపిస్తుంది వేసవి సెలవులు కావడము తో విద్యార్థుల సందడి కూడా లేక మండల కేంద్రం బోసి పోతుందనే చెప్పాలి .జూన్ 4 మరుసటి రోజు నుంచి ఎవరు గెలిచినా అప్పటి నుంచి రాజకీయా నాయకుల సందడి మొదలవుతుంది.

బాణాసంచా విక్రయాలపై నిషేదం

గొలుగొండ, మే 23, మేజర్‌న్యూస్: జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపధ్యంలో ర్యాలీలు, ఊరేగింపులకు ఎటువంటి అనుమతులు లేవని గొలుగొండ ఎస్సై బి.కృష్ణారావు చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ అలాగే బాణసంచా విక్రయాలపై నిషేధం విధించిందని, ఎవరైనా ఆంక్షలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భారీగా మద్యం బాటిళ్ల స్వాధీనం

మాధవధార, మే 23, మేజర్‌న్యూస్: కంచరపాలెం పరిధిలోని బర్మా క్యాంపులో పోలీసులు కార్డన్ సెర్చ్ జరిపారు. స్థానిక నూకాలమ్మ ఆలయం వద్ద ఇటీవలమహిళలపై జరిగిన దాడి సంఘటనపై రాజకీయ రంగు పడ పోలీసుల కార్డన్ సెర్చ్ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే ఆ ప్రాంతంలో ఇటువంటిఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు డీసీపీ మేక సత్తిబాబు, ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి అక్కడ పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసిన విషయంతెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారు జామున అకస్మాత్తుగా డీసీపీ మేక సత్తిబాబు, ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, తమ సిబ్బందితో కలిసి బర్మా క్యాంప్, శ్రీనివాస్ నగర్, అల్లూరి సీతారామరాజు నగర్, తదితర ప్రాంతాలో సకార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈమేరకు బెల్ట్ షాపులు నడుపుతున్న ఇళ్లల్లో పోలీసులు తనిఖీలు చేసి భారీగా మద్యం బాటిళ్ళను, అనుమానస్పదంగా సంచరిస్తున్న కొంతమంది యువకులను,14 బైకులను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా డీసీపీ మేకా సత్తిబాబు మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో, శాంతిభద్రతల సమస్యలను దృష్టిలో పెట్టుకొని జోన్-2 పరిధిలోని మూడు సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ చేపట్టినట్టు తెలిపారు. ఇందులో భాగంగా లిక్కర్‌బాటిళ్లను, లూస్ పెట్రోలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనుమానితులను అదుపులోకి తీసుకొనివిచా రిస్తున్నామన్నారు. ఎన్నికలు కోడ్ అమలులో ఉన్నందున అందరూజాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్డన్ సెర్చ్ లో డీసీపీఏసీపీలతో పాటు పెందుర్తి సీఐ రామకృష్ణ, ఎస్సైలు రవికుమార్, సమీర్,అసిరి తాత, అదనపు ఎస్ఐలు సత్యనారాయణ, ఆదిరాజు, పోలీస్ సిబ్బంది. అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆంధ్రాలో కూటమి విజయఢంకా మోగిస్తుంది

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

భీమునిపట్నం, మే 23, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి మూడు పార్టీల కూటమి విజయం సాధించి కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు అన్ని రకాలుగా అనుకూలంగా ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు వ్యాఖ్యానించారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గంటా నూకరాజు మాట్లాడారు. ప్రజా శ్రేయస్సును కోరే సంక్షేమ ప్రజా ప్రభుత్వం రాబోతుందని అన్నారు. జూన్ 4వ తారీకున విలువడే ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రంలో కూటమికి 120 నుండి 130 సీట్లు తప్పకుండా వచ్చి తీరుతాయని అన్నారు. జూన్ 9వ తారీకున ప్రజా ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం తధ్యమని చెప్పారు. ఈ ఐదేళ్ళల్లో వైకాపా ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు ఏమి కోల్పోయారో అది కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుందని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలకు రక్షణ, డ్రగ్స్, గంజాయి పూర్తిగా కట్టడి చేయడం, నాణ్యమైన విద్య, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, సంపద సృష్టి, అన్ని రకాల వస్తువులపై ధరల నియంత్రణ ఒక్క నారా చంద్రబాబు నాయుడు వలనే సాధ్యమని అన్నారు. అందుకే రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఓటరులు పోలింగ్ బూతులవద్ద మండుటెండలను లెక్కచేయకుండా క్యూ లైన్లో నిలబడి ఓట్లు వేశారని అన్నారు. యువత, మహిళలు, వృద్ధులు కూడా అధిక సంఖ్యలో ఓట్లు వేయుటకు ముందుకు వచ్చారని చెప్పారు. ఈ మార్పే జూన్ 4వ తారీకున విలువడే ఫలితాలు కూటమికి అనుకూలంగా ఉన్నాయని అర్ధమవుతుందని అన్నారు. ఎన్నికల సరళిని గుర్తించే కొంతమంది వైకాపా రౌడీ మూకలు పోలింగ్ బూతుల్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి ఈవిఎమ్ లను ధ్వంసం చేశారని అన్నారు. కూటమికి ఓట్లు వేసిన ప్రజలపై దాడులకు పాల్పడ్డారని అన్నారు. వైకాపాకు అధికార మదం దిగి దౌర్జన్యం చేసిన వారిని కటకటాలకు పంపించే సమయం త్వరలో ఉందని చెప్పారు. తెలుగుదేశం నుండి పోటీచేసిన కూటమి భీమిలి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి మతుకుమిల్లి శ్రీభరత్ లు అఖండ మెజారిటీతో గెలుస్తారని, ఇక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సంబరాలు చేసుకోవడమే ఆలస్యమని గంటా నూకరాజు చెప్పారు.

రికార్డులు లేని 66 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

పాయకరావుపేట మే 23 మేజర్ న్యూస్:అనకాపల్లి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నర్సీపట్నం డిఎస్పి ఆధ్వర్యంలో పాయకరావుపేట సి.ఐ పి. అప్పలరాజు మరియు నక్కపల్లి,నర్సీపట్నం టౌన్, రూరల్ సి.ఐలు,ఎస్.ఐలు సుమారు 90 మంది పోలీస్ సిబ్బంది గురువారం పాయకరావుపేట పట్టణంలోని దుర్గ కాలనీ,అంబేద్కర్ కాలనీలో కోఆర్డినేట్ సెర్చ్ నిర్వహించి రికార్డులు లేని 66 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.వాహన యజమానులు సంబంధిత రికార్డులను తీసుకొచ్చిన ఎడల పరిశీలించి వాహనాలు అప్పగించడం జరుగుతుందని పోలీసులు తెలిపారు.

సమ్మర్ క్యాంప్‌లో భాగంగా కంప్యూటర్ శిక్షణ

పాయకరావుపేట, మే 23, మేజర్‌న్యూస్: పాయకరావుపేట శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో భాగంగా గురువారం విద్యార్థులకు కంప్యూటర్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఇంచార్జ్ అధికారి వామల లక్ష్మణరావు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ చాలా అవసరమని, గ్రంథాలయంలో ఉన్న కంప్యూటర్ ని విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 15 మంది విద్యార్థులు సమ్మర్ క్యాంపుకు హాజరైనట్లు తెలిపారు.

నేటి నుండి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

భీమునిపట్నం, మే 23, మేజర్‌న్యూస్: నేటి నుండి ఏపీ టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు భీమిలి ఎమ్. ఈ. ఓ. - 1 శివరాణి ఒక ప్రకటనలో తెలిపారు. భీమిలి మండలం లో 240 విద్యార్థులు పరీక్షలు హాజరవుతున్నట్లు తెలిపారు. గవర్నమెంట్ హై స్కూల్, భీమిలి, జడ్పీ హై స్కూల్, చిట్టివలస పరీక్షా కేంద్రంలు కేటాయించడమైందని, ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి. పరీక్షా కేంద్రంలోనికి ఉదయం 8.30 గంటల నుండి 9 గంటల వరకు మాత్రమే అనుమతి ఇస్తారని ఎంఈవో తెలిపారు. 24.05.24 ఫస్ట్ లాంగ్వేజ్, 25.05.24 సెకండ్ లాంగ్వేజ్, 27.05.24 థర్డ్ లాంగ్వేజ్, 28.05.24 మ్యాథ్స్, 28.05.24 ఫిజికల్ సైన్స్, 30.05.24 బయాలజికల్ సైన్స్, 31.05.24 సోషల్ స్టడీస్, 01.06.24 ఓ ఎస్ ఎస్ సి పేపర్ -1, 03.06.24 ఓ ఎస్ ఎస్ సి -2 టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని ఆమె తెలిపారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఉద్యోగ విజయోత్సవ వేడుక

56 మంది విద్యార్థిని విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన ప్రిన్సిపల్ రామచంద్ర

నర్సీపట్నం అర్బన్, మే 23, మేజర్‌న్యూస్: నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ఉద్యోగ విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2023-24 విద్యా సంవత్సరమునకు గాను ఉద్యోగాలు పొందిన 56 విద్యార్థిని విద్యార్థులకు నియామక పత్రములు అందజేశారు. గత ఆరు నెలల కాలంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ నందు వివిధ కంపెనీల ద్వారా క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించగా నర్సీపట్నం పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థి నీ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. పట్టుదలతో చదివితే విజయం సాధించవచ్చని, తల్లిదండ్రులకు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా వాటర్ రిసోర్స్ మేనేజ్మెంట్ డి ఈ రాజేంద్ర కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్ ఎంవి రత్న ప్రసాద్, మైన్స్ మేనేజర్ ఎం రామస్వామి, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు, ఉద్యోగాలు

సాధించిన విద్యార్థుల విద్యార్థులను ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ జీవి రామచంద్రరావు మాట్లాడుతూ, ఉద్యోగాలు పొందిన విద్యార్థినీ అభినందించారు. వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపేలా తగు సూచనలను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో విజ్ఞాన వేసవి శిబిరాల్లో

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

అచ్చుతాపురం, మే 23, మేజర్‌న్యూస్: గురువారము అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో విజ్ఞాన వేసవి శిబిరాల్లో భాగంగా బుధవారం పిల్లలందరూ కూడా డ్రాయింగ్ పోటీలో పాల్గొని వివిధ రకములైన చిత్రపటాలను వేయడం జరిగింది ఈ కార్యక్రమాన్ని అచ్యుత స్కూల్ తెలుగు టీచర్ మాధవి నిర్వహించబడినది ఆమె మాట్లాడుతూ డ్రాయింగ్ అనేది ఒక కళ చిత్ర నైపుణ్యం వంటి వివిధ రకములైన ఆర్టికల్స్ ను మీలో అందరికీ కూడా గొప్ప ఆర్టిస్ట్ అయ్యే అవకాశాలు కలుగుతాయి .కాల ప్రభావాన్ని బట్టి మీ ఆలోచనలను అనుగుణంగా వివిధ రకమైన చిత్రపటాలను వెయ్యవా లేను. స్థానిక లైబ్రరీ మాట్లాడుతూఈ చిత్రపటాలలో ఎంపిక చేసి ఫస్ట్ సెకండ్ విజేతలగా నిర్ణయించబడును వారికి కూడా జూన్ 7వ తారీఖున అచ్యుతాపురం శాఖ గ్రంథాలయ ఆవరణలోప్రైజులు ఇవ్వబడుతాయి అని స్థానిక లైబ్రేరియన్ డి కోటేశ్వరరావు వివరించారుఈ డ్రాయింగ్ కార్యక్రమంలో అచ్యుత స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి వారి షష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు

భీమునిపట్నం, మే 23, మేజర్‌న్యూస్: భీమిలి లో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి వారి షష్టమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తేదీ. 22-05-2024 బుధవారం సాయంత్రం 7.00 గం కు శ్రీవారి తిరుకళ్యాణ మహోత్సవం అత్యంత వైభవోపేతముగా జరిగినది. ఈ కార్యక్రమం శ్రీమాన్ ముప్పిరాల అనంతాచార్యులు ఆలయ ప్రధానార్చకులు శ్రీమాన్ పురాణం శేషాచార్యులు మరియు శిష్య బృందం మనోజ్, విష్ణు వారి ప్రత్యక్ష పర్య వేక్షణలో జరుగగా, ఆలయ ట్రస్టీస్ శ్రీ కలిగొట్ల శ్రీరామ చంద్ర మూర్తి, కలిగొట్ల సూర్య నారాయణ మూర్తి, కలిగొట్ల భానోజీరావు, కలిగొట్ల శ్రీనివాసరావు, కోశాధికారి వి.బంగార్రాజు, కలిగొట్ల వారి కుటుంబ సభ్యులు, మరియు ఆర్ ఆర్ ఇంజనీరింగ్ ఎమ్. డి. శ్రీనివాస్, విటా మైనింగ్ ఎమ్. డి. విజయ్ భాస్కర్, చందు భాయ్, మరియు భీమిలి పరిసర ప్రాంత అశేష భక్త జనులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి లెక్కింపు ఏజెంట్ నాయకుల సమావేశం

భీమునిపట్నం, మే 23, మేజర్‌న్యూస్: స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బూత్ స్థాయి లెక్కింపు ఏజెంట్ నాయకుల సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మరియు భీమిలి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలుస్తున్నాం. ముందుగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. జూన్ 4 వతేదీన జరిగే ఎన్నికల లెక్కింపు సమయంలో ప్రత్యర్థులు తప్పుడు ప్రయత్నాలకు పాల్పడతారు. కావున ప్రతి ఏజెంట్ ఎన్నికల లెక్కింపు సమయంలో ఎన్నికల అధికారులకు సహకరిస్తూ సమయస్ఫూర్తి గా ఉండాలని ప్రత్యర్థులు తప్పుడు సర్వేలు తో మేము గెలవబోతున్నాం అని ప్రచారం చేస్తున్నారని భీమిలి అవంతి శ్రీనివాస్ గెలుపు అనివార్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గంలో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ పండగ

పరవాడ, మే 23, మేజర్‌న్యూస్: శివాలయం రోడ్డులో ఉన్న బ్రాహ్మని ముత్యాలమ్మ పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి అమ్మవారు దర్శనం చేసుకున్నారు. అమ్మవారిని దర్శనం చేసుకున్న వారిలో మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

గరుడ వాహనంపై వేంకటేశ్వరుడు

ఘనంగా 5వ రోజు బ్రహ్మోత్సవాలు

నరసన్నపేట, మే 23, మేజర్‌న్యూస్: నరసన్నపేట పట్టణంలోని పురాతన వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి గరుడ వాహనము పై ఆసీనులై పట్టణ పురవీధుల వెంబడి వివిధ రకాల సాంస్కృ తిక కార్యక్రమాల ఊరేగింపు అంగరంగ వైభవంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్రవచనకర్త రాధా మనోహర్ దాస్ పాల్గొని సంస్కృతి సాంప్రదాయాలను కాపాడవలసిన అవసరం ప్రతి ఒక్కరి పైన ఉందని, ఆధ్యాత్మిక భావనతో అందరూ కలిసిమెలిసి జీవించాలని ఆచార సాంప్రదాయాలను పాటిస్తూ సనాతన ధర్మాన్ని ప్రతి హిందువు పాటించాలని అన్నారు. ఈ ఊరేగింపులో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి కృష్ణమాచార్యులు అర్చక బృందం,వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఒకే సిలబస్‌ను అమలు చేయాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు

బొబ్బిలి, మే 23, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నుండి విద్యార్థులకు ఒకే విధమైన సిలబస్ ను ప్రవేశ పెట్టాలని ఏ పి టి ఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జె సి రాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్ జి ఓ హోమ్ లో ఫెడరేషన్ డివిసిన్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బొబ్బిలి మండల శాఖ అధ్యక్షులు సి హెచ్ .జె ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఏ పి టి ఎఫ్ రాష్ట్ర నాయకులు జె సి రాజు మాట్లాడుతూ 6,7 తరగతులకు గణితం, సామాన్య శాస్త్రం, ఇంగ్లీష్ సి బీఎస్ ఈ సిలబస్ కాగా మిగతావి రాష్ట్ర సిలబస్ అని అలాగే ,8,9,10 తరగతుల విద్యార్థులు అన్ని సబ్జెక్ట్స్ ను ఒకే సి బి ఎస్ ఈ సిలబస్ లోనే చదువుతారని కానీ పరీక్షలు వేరువేరుగా రాయాల్సి రావటంతో విద్యార్థులు, తల్లితండ్రులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని అన్నారు. ఒకే సిలబస్ చదివిన విద్యార్థులు కొందరు సి బి ఎస్ ఈ పరీక్షలు రాస్తే మరికొందరు రాష్ట్ర పరీక్షల నిర్వహణ విభాగం నిర్వహించే పరీక్షలు రాస్తారని,ప్రశ్న పత్రాల స్థాయి, విద్యార్థుల సామర్థ్యాల పరిశీలనలో వ్యత్యాసం వుంటున్నదని ఇది సరైన పద్ధతి కాదనిఅన్నారు. ఒకే సిలబస్,ఒకే పరీక్షలు విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని,విద్యార్థులందరికి సమన్యాయం ,సమాన అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే 117 వ జి ఓ ను రద్దు చేసి

ప్రాథమిక విద్య బలోపేతం అయ్యేలా ఒకటి నుండి ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలను ఒకే చోట పెట్టాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి పద్మ మాట్లాడుతూ ప్రాథమిక విద్య ,విద్యార్థి ఇష్టాన్ని బట్టి మాధ్యమాన్ని ఎంచుకొనేలా తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు విద్యార్థికి అందుబాటులో ఉంచి వాటిని కొనసాగించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు బంకురు జోగినాయుడు సి పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, లక్ష్మణ రావు, రామ కృష్ణ, పరిసి నాయుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంట శివాలయంలో సామూహిక హారతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బొబ్బిలి, మే 23, మేజర్‌న్యూస్: బొబ్బిలి మండలం పెంట గ్రామంలో వేగావతి నదీ తీరంలో వేంచేసియున్న శ్రీఅన్నపూర్ణ సహిత నగరేశ్వరస్వామి దేవాలయంలో గురువారం సామూహిక హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు నృసింహజయంతి, గౌతమబుద్ద జయంతి, అన్నమయ్య జయంతి మరియు వైశాఖమాస పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజల్లో భాగంగా సత్యనారాయణవ్రతం మరియు సామూహికహారతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సమరసతసేవాఫౌండేషన్ డివిజన్ ధర్మప్రచారక్ ధూపంవాసు మాట్లాడుతూ, సామూహికంగా చేసేపనికి శక్తి లభిస్తుందని తద్వారా భగవంతుని అనుగ్రహం సిద్దిస్తుందని అన్నారు. లోకమంతా క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

కె. కోటపాడు, మే 23, మేజర్‌న్యూస్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ అనకాపల్లి వారి సౌజన్యతో, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి విశాఖపట్నం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం గురువారం ఉదయం హై స్కూల్ గ్రౌండ్‌లో జరిగింది. ఈ శిబిరం లో 85 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా 35 మందికి కంటి ఆపరేషన్ ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. కంటి నరాలు చికిత్స కోసం, కంటి పై పొర చికిత్స కోసం, కంటి నీటి కాసుల చికిత్స కోసం, కంటి రెప్పల చికిత్స కోసం మరియు చిన్నపిల్లల కంటి చికిత్స కోసం పలువురు ని ప్రత్యేకంగా ఆసుపత్రిలో చికిత్స చేయుటకు ఈ శిబిరం నుండి ఎంపిక చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సంస్థ విన్నకోట ఆనందరావు (ప్రెసిడెంట్), కోట్ల రాంబాబు (సెక్రెటరీ), మామిడి రమణాజీ (ట్రెజరీ) శంకర్ ఫౌండేషన్ డాక్టర్ మధులిక ఆప్తలమిక్ ఆఫీసర్ హరి చందన, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆర్డి నేటర్ సి హెచ్ అశ్వని కుమార్ నర్సింగ్ స్టాఫ్ దీపిక ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముత్యమాంబ తల్లి పండుగ మహోత్సవం

చోడవరం, మే 23, మేజర్‌న్యూస్: మండలంలోని అంబేరుపురం గ్రామ ప్రజల ఆరాధ్య దైవం ముత్యమాంబ అమ్మవారి పండుగ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. పండుగ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, సారే, పండ్లు ఫలహారాలు, ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి, మొక్కలు చెల్లించు కున్నారు. అగ్ని గుండములు తొక్కి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవా రిని దర్శిం చుకునేందుకు భారీగా భక్తులు తరలి రావడంతో ఆలయం కిటకిట లాడింది. సాయంత్రం అమ్మ వారి ఊరేగింపు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దాతల సహకారంతో మజ్జిగ, పులిహోర, తీపి బూంది, కొమ్ము శనగలు అరటిపళ్ళు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. మండుటెండలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. స్థానికులతో పాటు గోవాడ, వెంకన్నపాలెం, గజపతి నగరం, పరిసర గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించు కున్నారు. గ్రామ ప్రజల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేగి శ్రీనివాసరావు, వేగి ముత్యాల నాయుడు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు,ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

యూజేఎఫ్ డైరీల ఆవిష్కరణ

జి.మాడుగుల, మే 23, మేజర్‌న్యూస్: జి.మాడుగుల మండల కేంద్రంలో యు.జే.ఎఫ్ డైరీలను గురువారం స్థానిక సీఐ రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు జిల్లాలకు సంబంధించి మంచి విలువైన సమాచారంతో డైరీలను రూ పొందిం చారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఇంత మంచిగా డైరీలను రూపుదిద్దించిన ప్రతినిధులకు అభినం దనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూజేఎఫ్ ప్రతినిధి రాము మాట్లాడుతూ యూజేఎఫ్ అన్ని యూని యన్లకు అతీతంగా ఉంటుందని, అదేవిధంగా జనం కోసం మనం అనే సిద్ధాంతంతో యుజేఎఫ్ పనిచేస్తుందని అన్నారు. మంచి విలువలతో కూడిన ఈ డైరీనీ ఆరు జిల్లాలలో ఉన్న ప్రతి యొక్క విలేకరులకు చేరాలని ఉద్దేశంతో 17 టీములుగా తయారు చేసి, ఆరు జిల్లాలు ఉన్న ప్రతి మండలంలో ఉన్న విలేకరికి డైరీ చేరే విధం గా కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యుజేఎఫ్ ప్రతినిధులు. రవి, జి.మాడు గుల విలేకరులు అరుణ్, సత్యనారా యణ, జాన్, గుప్తా, శ్రీను, అమీర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తరలివచ్చిన వేలాది మంది బంధువులు

పద్మనాభం, మే 23, మేజర్‌న్యూస్: మండలంలో గెద్దపేట గ్రామ ప్రారంభంలో కొలువు దీరిన రాజ్యలక్ష్మి అమ్మవారి అనుపోత్సవంను గురువారం రాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. గత రెండు రోజుల నుండి జరుగుతున్న పండగ నేటితో ముగిసింది. అనుపోత్సవం సందర్భంగా సాయంత్రం గ్రామ సతకం పట్టువద్ద పూర్వం నుండి వస్తున్న ఆచారం ప్రకారం రథోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామ ప్రజలు మొక్కులు తీర్చుకున్నారు. అయితే చాలా కాలం తరువాత పండగ చేయడంతో వేలాది మంది బంధువులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు,సర్పంచ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ మంజు బార్గవి,ఉత్సవ కమిటీ సభ్యులు సూరినాయుడు, ప్రసాదు, పాల్గొన్నారు.

నేడు 11 కేవీ గ్రేహౌండ్స్ ఫీడర్‌లో

మరమ్మత్తులు నిమిత్తం విద్యుత్ అంతరాయం

భీమునిపట్నం, మే 23, మేజర్‌న్యూస్: పోలాకి .శ్రీనివాసురావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, ఆపరేషన్, జోన్-3, విశాఖపట్నం వారి సూచనల మేరకు తేదీ 24.05.2024 శుక్రవారం నాడు ఉదయం 9.00 నుండి మధ్యాహ్నం 4:00 గంటల వరకు 11 కేవీ గ్రేహౌండ్స్ ఫీడర్ యొక్క లైన్ లను తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించుట మరియు ఇతర మరమ్మత్తుల నిమిత్తము విద్యుత్ నిలుపుదల చేయబడునని భీమిలి ఏ. ఈ. ఒక ప్రకటనలో తెలిపారు. గ్రే హౌండ్స్, తిమ్మాపురం, హాచెరీస్, మొదలైన ప్రాంతాలకు విద్యుత్ నిలుపుదల చేయబడును. విద్యుత్ వినియోగదారులు, ప్రజలు మాతో సహకరించాలని కోరారు.

మహారాజా బ్యాంకుకి 'భారత్ రత్న

సహకారిత సమ్మాన్ 2024'

ఉత్తమ అర్బన్ కో- ఆపరేటివ్ బ్యాంకుగా ఏపీ స్టేట్ " అవార్డు

విశాఖపట్నం, మే 23, మేజర్‌న్యూస్: మహారాజా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకి "భారత్ రత్న సహకారిత సమ్మాన్ 2024" అవార్డు దక్కింది. ఈ మేరకు బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షులు ఎం. రామకృష్ణంరాజు, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం. మురళీ కృష్ణ వర్మ సంయుక్తంగా ఈ అవార్డును బుధవారం ముంబైలోని లలిత్ హోటల్‌లో స్వీకరించారు. జాతీయ స్థాయిలో కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులకు సంబంధించిన వ్యాపారపు విధి విధానాలలో ఉత్తమ ప్రతిభ చూపినందుకు గానూ ఈ అవార్డు దక్కినట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా డైరెక్టర్ సతీష్ మరాఠే, భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ కమ్యూనికేషన్స్ అండ్ ఐటి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సుమనేష్ జోషి, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్స్ మరియు క్రెడిట్ సొసైటీస్ (నాఫ్ కబ్) ఛైర్మన్ లక్ష్మీ దాస్ ముఖ్య ప్రసంగీకులుగా,మహారాష్ట్ర స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్స్ ఫెడరేషన్ ఛైర్మన్ అజయ్ బ్రహ్మచ, ఆదర్శ్ కో- ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ జి. మదన గోపాల స్వామి వివిధ కో ఆపరేటివ్ బ్యాంకుల ఛైర్మన్లు పాల్గొన్నారని తెలిపారు. దేశములో 1514 కో ఆపరేటివ్ బ్యాంకులు, 10329 శాఖలుగా ఉండగా వీటిలో మల్టీ స్టేట్ బ్యాంకులు-62, షెడ్యూల్డ్ బ్యాంకులు-52, మల్టీ స్టేట్ షెడ్యూల్డ్ బ్యాంకులు-32, టైర్ -1 బ్యాంకులు -813, టైర్-2 బ్యాంకులు-701 గా ఉన్నట్లు తెలిపారు. అయితే గత ఆర్థిక సంవత్సరములో మహారాజ బ్యాంకు 2024 మార్చి 31 నాటికీ డిపాజిట్స్- రూ. 266 కోట్లు, రుణములు - రూ. 177 కోట్లు తో మొత్తం వ్యాపారం రూ. 445 కోట్లు కలిగి ఉన్నామని బ్యాంకు ఛైర్మన్ వెల్లడించారు. లాభాలు రూ. 4.02 కోట్లు ఆర్జించగా, ఆదాయపు పన్ను 1.02 కోట్లు చెల్లించగా రూ. 3 కోట్లు నికర ఆదాయాన్ని ఆర్జించినట్లు, బ్యాంకు నికర విలువ రూ. 27.86 కోట్లు కలిగి ఉన్నట్టు స్పష్టం చేశారు. త్వరలో తుని మరియు అనకాపల్లి శాఖలను ప్రారంభిస్తున్నట్టు. బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షులు ఎం. రామ కృష్ణం రాజు, జనరల్ మేనేజర్ యన్. యన్. సత్యనారాయణ తెలిపారు.

బుద్ధుని జీవితం మానవాళికి ఆదర్శప్రాయం



రేగిడి, మే 23, మేజర్‌న్యూస్: బుద్ధుని జీవితం మానవాళికి ఆదర్శ ప్రాయమని వక్తలు ఎన్ వి రమణ,కంచుమోజు రామ్మోహనరావు లు తెలిపారు.గురువారం రేగిడి దత్త పీఠంలో బుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణ అధ్యక్షతన జ్ఞాన బోధ సభ జరిగింది.ముందుగా దత్త పాదుకా పూజ, గణపతి హోమం, ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఆధ్యాత్మిక వేత్తలకు సత్కారాలు జరిగాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సత్యాన్వేషణ కొరకు బుద్ధుడు తపస్సు చేసి జ్ఞానం పొంది దానిని తన బోధనల ద్వారా ప్రపంచానికి తెలియజే శారన్నారు. ఈ కార్యక్రమంలో దత్త పీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు, వక్తలు కోట మోహన్ రావు, జడ్డు జగ్గారావు, భక్తులు యత్రాపాత్రుని భాస్కర రావు, కుడుతుల మురళీ, జల్లు శివ,పూతి బాలకృష్ణ,సామంతుల మధు, బొత్స గజేంద్ర నాయుడు పాల్గొన్నారు.

శ్రీవారి నామస్మరణతో పులకించిన నగర వీధులు

- పితామహుడు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జయంతి వేడుకలు
- కార్యదర్శి బెహరా నాగేశ్వర రావు

శ్రీకాకుళం, మే 23, మేజర్‌న్యూస్: పద కవితా పితామహుడు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల 616వ జయంతి సందర్భంగా గురువారం శ్రీ కళ్యాణ వేంకటేశ్వర దేవస్థానం నుండి ప్రాతఃకాలంలో శ్రీవారి సేవకులుచే నగర వీధుల్లో అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తూ శోభాయాత్రను కొనసాగించారు. నగర వీధులలో గోవిందా, గోవిందా అంటూ స్వామి వారి నామస్మరణతో మార్ మ్రోగాయి. అధ్యక్షులు మర్రి యోగేశ్వర రావు, కార్యదర్శి బెహరా నాగేశ్వర రావు, కోశాధికారి దండ నాగేశ్వర రావు, ఉపాధ్యక్షులు మాడుగుల కాశీప్రసాద్ లు మాట్లాడుతూ తాళ్ళపాక అన్నమాచార్యుల జయంతి సందర్భంగా శ్రీకాకుళం స్థానిక కలెక్టర్ బంగ్లా దరిలో గల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర దేవస్థానంలో స్వామి వారు ప్రత్యేక అలంకరణతో, నామ సంకీర్తనలతో, అభిషేకాలతో, అష్టోత్తర శతనామావలి, సహస్ర నామాలతో ఆలయ అర్చకులు శ్రీ బూరాడా వంశీ కృష్ణమాచార్యులు నేతృత్వంలో ఈ రోజంతా విశేష పూజాలందుకోనున్నారని తెలిపారు. అలాగే మధ్యాన్నం స్వామి వారి అన్నప్రసాధ వితరణ కార్యక్రమం ఉందని నగర ప్రజలంతా పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు. సాయంత్రం 6.30గంటల నుంచి అన్నమయ్య కీర్తనలతో, భజనాది కార్యక్రమంలు జరగనున్నాయని భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులుకాగలరన్నారని ఆలయ ధర్మకర్త, గౌరవ అధ్యక్షులు శ్రీ లోకానాదం నందికేశ్వర రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సంయుక్త కార్యదర్శి, ఉప కార్యదర్శి, సహా కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కార్యనిర్వాహక సభ్యులు, సలహా సభ్యులు, భక్త జన బృందం పాల్గొన్నారు.

సైన్స్ సబ్జెక్ట్‌పై పిల్లలకు అవగాహన

తెర్లాం, మే 23, మేజర్‌న్యూస్: పిల్లలో బోధనా శక్తి సైన్స్ పట్ల అవగాహన కలిగి విజ్ఞానం పెంపొందించే విధంగా జెడ్ పి హై స్కూల్ ప్రధాన ఉపాధ్యా యులు ఎం.ఎం. ఆర్ రమేష్ పలు అంశాలపై న అవగాహన కల్పించారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సందర్శించి విద్యార్థు లకు పాఠకులకు పలు రకాల పుస్తకాలు చదవడం రాయడం వంటి పలువిషయా లను తెలియ జేశారు. అలాగే డ్రాయింగ్ వేయడం తద్వారా కళలు సాహిత్యం పట్ల దృష్టి సారించాలని సూచించారు. అలాగే గ్రంథాలయ అధికారి సి హెచ్ కృష్ణ మూర్తి పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించారు. కార్య క్రమంలో వారితో పాటు ఉపాధ్యాయులు కె. విస్సు పిల్లలు పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

రేగిడి, మే 23, మేజర్‌న్యూస్: మండలం వన్నలి పంచాయతీ యందువాని చెరువు లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపిఓ ఎస్ హరినాథ్ గురువారం పరిశీలించారు. చెరులో పనిచేస్తున్న 230మంది వేతనదారుల మస్తర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వేతనదారులతో మాట్లాడుతూ రెండు పూటలా కొలతల ప్రకారం పని చేసినట్లైతే మూడు వందల రూపాయలు వేతనం వస్తుందని చెప్పారు.ప్రతి వేతనదారులు తప్పని సరిగా మంచి నీరు తీసుకుని రావాలని తెలిపారు. మేట్లు ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు పంపించాలని అన్నారు. మెట్టుపొలం వున్న సన్న చిన్న కారు రైతులకు పండ్ల తోటలు వేసుకోవడానికి అవకాశం ఉందని, తోటలు ఉన్న రైతులకు కందకాలు తవ్వుకొనుటకు, చెట్టు చుట్టూ ట్రెంచ్ లు తవ్వుకొనుటకు అవకాశం ఉందని తెలిపారు.ఈయనతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ ఎర్రయ్య,మేట్లు పాల్గొన్నారు.

దాతలు కోసం ఏదురుచూపులు

-చిన్నారి యశోదను ఆదుకోరూ -అధిక టీబితో బాధపడుతున్న చిన్నారి -ఆక్సిజన్ కాంసెంట్రీటర్ లేకపోతే చిన్నారి ప్రాణం నిలవదు -చావుతో పోరాటం
- రిమ్స్ స్టాఫ్ నర్స్ సిస్టర్ గిరిజాలా మహాలక్ష్మి

శ్రీకాకుళం, మే 23, మేజర్‌న్యూస్: స్థానిక జెండాల వీధికి చెందిన సుహాసినీ నిరుపేద కుటుంబానికి చెందిన వారు కాగా, భర్త లేరు, ఇద్దరు కుమార్తెలు. చిన్న చిన్న పనులు చేసుకుంటూ కాలం నెట్టుకొస్తున్నారు. పెద్ద కుమార్తే చదువుల సరస్వతి యశోద ప్రభుత్వ జూనియర్ కళాశాల శ్రీకాకుళంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివింది. విధి నాటకంలో భాగంగా టీబికి గురై గత సంవత్సర కాలంగా చదువుకు దూరమై, అధిక టీబితో అనారోగ్యం పాలయింది. గతంలో ఈ కుటుంబానికి పత్రికా ప్రతినిధి జగదీశ్, తన మిత్రులు యోగేష్ ల ద్వారా వీరి దీన స్థితిని తెలుసుకున్న సామాజిక సేవకులు ఉర్లం. శివతేజ, శ్రీ సత్య సాయి హై స్కూల్ లో నాలుగవతరగతి చదువుతూ, సామాజిక సేవలో చిన్నతనంలోనే ముందుంటున్న చిన్నారి ట్వింకిల్ సహాయంతో ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ పి. జగన్ మోహన్ రావు, యశోదమ్మా ఫౌండేషన్ మాధారపు డేవిడ్, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి శిల్లా రమేష్, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ డా. టి. మణికంఠ రావు, జిల్ ఫౌండేషన్ జాడ సాయి, మదర్స్ లవ్ ఫౌండేషన్ సుప్రజా రౌతు, లైన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్ తమ సహాయాన్ని వివిధ రూపాలలో అందించి ఆధుకున్నారు.

ఈ రోజు యశోద చావు, బ్రతుకుల మధ్య పోరాటం చేస్తుందని రిమ్స్ ప్రభుత్వ వైద్యాశాలలో విధులు నిర్వర్తిస్తున్న స్టాఫ్ నర్స్ సిస్టర్ గిరిజాలా మహాలక్ష్మి ఆవేదన చెందారు. గతంలో వీరికి సహాయం చేసిన ప్రతీ ఒక్కరికి శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుతున్నానని, ఆక్సిజన్ కాంసెంట్రీటర్ కు సుమారు ఎనభై వేలు వరకు ఖర్చువుతుందని ఇందుకు సామాజిక సేవకులు శివతేజ అందించిన సమాచారంతో మధారపు డేవిడ్ మిత్ర బృందం, యోగేష్ మిత్ర బృందం ముప్పై వేల వరకు సహకరించారని, దాతలు ముందుకు వచ్చి ఈ చిన్నారి ప్రాణాలు కాపాడాలన్నారు. ఈ కుటుంబం దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. లతఃకార్యక్రమంలో సామాజిక సేవకులు శివతేజ, రిమ్స్ ప్రభుత్వ వైద్యాశాల స్టాఫ్ నర్స్ సిస్టర్ గిరిజాలా మహాలక్ష్మి, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వాహన యజమానులు తస్మాత్ జాగ్రత్త

రావికమతం, మే 23, మేజర్‌న్యూస్: ద్విచక్ర వాహనాలు,కార్లు, ఆటోలు రోడ్లపై తిరుగుతున్న వాటిని పోలీసులు నిలిపి రికార్డులను తనిఖీ చేసే అనవాయితీ ఇంతవరకు కొనసాగుతుంది. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్నెస్, పొల్యూషన్, సర్టిఫికెట్లు లేకపోతే, జరిమానలు విధించడం జరుగుతుంది. హెల్మెట్ ధరించ కుండా ద్విచక్ర వాహనం నడిపితే కూడ జరిమానా విధించడం కూడ కొనసాగు తోంది. తాజాగా కార్డెన్ సెర్చ్ పేరుతో పోలీసులు మూకుమ్మడి గా తెల్లవారుజా మునే గృహ యజమానులను తలుపు తట్టి లేపి ఇంటిలో ఉన్న వాహనాలకు సంబంధించిన రికార్డులును తనిఖీ చేస్తున్నారు. రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నారు. మన ఇంటిలో వాహనం ఉన్నదని ధీమాతో రికార్డులను ఆదమరిచెరో పోలీస్ స్టేషన్‌కు వాహనం వెళ్లాల్సిందే. తస్మాత్ జాగ్రత్త.

30న మండల సర్వసభ్యా సమావేశం

వంగర, మే 23, మేజర్‌న్యూస్: ఈ నెల 30 న వంగర మండల సర్వ సభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఉత్తర వెల్లి సురేష్ ముఖర్జీ తెలిపారు. ఈ సమావేశానికి అందరు అధికారులు, మండలంలో గల అందరు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితర ప్రజా ప్రతినిధులు అందరూ తప్పని సరిగా హాజరవ్వాలని ఆయన కోరారు.

బాడంగి గ్రంథాలయంలో
కంప్యూటర్ బేసిక్స్‌పై శిక్షణా

బాడంగి, మే 23, మేజర్‌న్యూస్: స్థానిక శాఖ గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయాధికారి ఆర్. దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు24 రోజులు పాటు నిర్వహించబడుతున్న వేసవి విజ్ఞాన తరగతులులలో భాగంగా కంప్యూటర్ బేసిక్స్ పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం పిండ్రంగి వలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. రవి బాబు విద్యార్థిని విద్యార్థులకు మరలా స్పోకెన్ ఇంగ్లీషు క్లాసు బోధించడంతో పాటు పిల్లలతో నీతి కథలు చదివించడం అందులో నీతో పిల్లలకు అర్థమైన రీతిలో వివరించడం జరిగింది గ్రంథాలయాధికారి దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ ఈ వేసవి శిక్షణా తరగతులకు వచ్చే విద్యార్థిని, విద్యార్థులకు చదువుతో పాటు చదరంగం, ఆటలు,పాటలు తరగతి గదులలో బోధించే పాఠాలతో సంబంధం లేకుండా నేటి పోటీ ప్రపంచంలోను ,సమాజంలో పిల్లలు ఏవిధంగా ఉండాలి అనే అంశంపై పిల్లలకు అవగాహన కల్పిస్తాం అని కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ వేసవి శిక్షణా తరగతులకు పంపించాలని కోరారు.

అధ్వాహనంగా రహదారులు ప్రయాణీకులకు తప్పని ఇబ్బందులు

వంగర, మే 22, మేజర్‌న్యూస్: వంగర మండలంలో గ్రామీణ ప్రాంతా లకు వెళ్లే రోడ్లు పాడై ప్రయాణీకులకు నరకాన్ని చూపిస్తున్నాయి. ఈ రోడ్లు,ఆ రోడ్డు ని కాకుండా, మొత్తం గ్రామీణ, కొన్నితారు రోడ్లన్నియు అధ్వాహనం గా తయార య్యాయి. ఇటు గ్రామీణ రోడ్లు కానీ, అటు కొన్ని గ్రామాలకు వెళ్ళవలసిన తారు రోడ్లు, ఏరోడ్లు చూసినప్పటికీ అతిదారుణంగా తయా రు కావటంతో వాహన దారులు, ప్రయాణీకులు రాక పోకలకు తీవ్ర ఇబ్బందులకు గురికా వటంతో ప్రయాణీకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రాకపోకలకు అనువుగా వుండవలసిన రోడ్లను పూర్తిగా ఎవరూ పట్టించు కోకపోవడం వల్ల రోడ్లు ఆకారం కోల్పోయాయి. పూర్తిగా రోడ్లను గ్రామ,గ్రామాలకు వెళ్ళవలసిన, అదేవిధంగా బస్సులు తిరుగుతున్న రోడ్లు, కొన్ని రోడ్లను చూసినప్పటికీ అన్నీ పూర్తిగా గోతులు తో నిండి పోయాయి.ఇలా తయారైన రోడ్లు మీదుగా, వేరే ఇతర గత్యంతరం లేక తప్పని సరి పరిస్థితుల్లో ప్రయాణిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురికాక తప్పటం లేదని రోడ్లుదుస్థితి పై ప్రయాణీకులు, ప్రజలుదు మ్మెత్తిపోస్తున్నారు. ఏదో కొద్దో,గొప్పో రోడ్లు కొంతలో, కొంత తారు, గ్రామీణ ప్రాంత రోడ్లు కూడా వర్షాలు మొదలు కాక ముందు ఎంతో కొంత ఫరావా లేదనిపించి నప్పటికీ, ఐటీవలగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా రోడ్లు గుమ్ము,గుమ్ములతో అతిదారుణంగా తయారైయ్యాయి. పూర్తిగా పాలంలో కెల్లే గోర్జలను తలపిస్తున్నాయి. గోతులు ఏ స్థాయిలో ఉన్నాయో తెలియని గోతులు తయారు కావటంతో ముఖ్యంగా" టు" వీలర్ల ప్రయాణీకులు ఇబ్బందులు వర్ణాతీతంగా ఉన్నాయి. ఎక్కడ ఏ బండి జోకర్లుపాడై తాయో,ఎక్కడ ఏ బండి నిలబడిపోతుందో,ఏప్రయాణీకుని నడ్డి విరుగు తుందో తెలియని పరిస్థితిలో రోడ్లు పాడయ్యాఇ. మడ్డువలస,జగన్నాదవలస రోడ్డుపూర్తినరకాన్ని చూపిస్తున్నాయి. అరసాడ నుండి, బాగింపేట రోడ్డు పూర్తిగా గోతులు మయంగా తయారై ప్రయాణీకుల ఆ రోడ్డు వారికి ఇబ్బందులకు గురవుతున్నారు.ఈరోడ్డు నిర్మాణం నకు నిధులు మంజూరైనప్పటికీ, పనులు సకాలంలో మొదలుకాక పోవటం,ఈ లోపు సార్వత్రిక ఎన్నికలు రావటం తో ఆ రోడ్డు పనులు మొదలు కాలేదు. దీంతో వాహన దారులకు నరకాన్ని చూపిస్తుందా రోడ్డు. ఎన్నికల క్రితం మొదలుపెట్టి, ప్రభుత్వం బిల్లులు చెలకించకపోవటం వల్ల రోడ్డు పనులు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు.అంతేకాకుండా కొట్టిశ, లక్కింపేట గ్రామం నకు గతంలో వేసిన రోడ్లు పూర్తిగా పాడై నందున ప్రయాణీకులకు ఇబ్బందులు చవి చూస్తున్నారు.అంతే కాకుండా మండలంలో నీలయ్యవలస, బాగింపేట మీదుగా అతి చేరువులో మండల కేంద్రానికి చేరటానికి, మండల కేంద్రం నుంచి కింజంగి, మరువాడ, చంద్రంపేట, చౌదరివలస, కొత్త మరువాడ, శీతాదేవి పురం, తదితర గ్రామాలవారు వివిధ పనుల మీదను చేరుకోవటానికి ఉన్నటువంటి రోడ్డు పూర్తిగా గుంతలతో మట్టిరోడ్డు పూర్తిగా పాడై ప్రయాణీకులకు నరకాన్ని చూపిస్తుంది. అదే విదంగా మండల కేంద్రానికి చాలా గ్రామాల ప్రజలు అతి చేరువలో చేరటానికి కింజంగి, అర్ అర్ కాలనీ, కింజంగి, ఇరువాడ తదితర గ్రామాల వారు వెళ్ళటానికి దేవకి వాడ అర్ అర్ కాలనీ నుండి, శ్రీహరిపురం అర్ అర్ కాలనీ వరకూ ఒక కీలో మీటరు వరకూ రోడ్డు సౌకర్యం కలగ జేస్తే ఆయా గ్రామాల వారు మండల కేంద్రానికి,మండల కేంద్రం నుండి వారి, వారి పనులు చూసుకొని వెంటనే ఏడేనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి వారి, వారి గ్రామాలకు చేరువలో చేరుకోవటానికి వీలుపడుతుంది. ప్రస్తుతం ఆయా గ్రామాల వారు ఆ ఒక్క కిలో మీటరు లో రోడ్డు సౌకర్యం లేక, ప్రస్తుతం మండల కేంద్రం వంగర చేరటానికి సుమారుగా 20 కిలోమీటర్ల దాటి వెళ్ళవలసి వస్తుంది. అంతే కాకుండా ఇలాంటి ఇబ్బందులు చాలాగ్రామాల వారికి ఉన్నాయి.ఈ మండల ప్రజలు అతి చేరువలో మండల కేంద్రానికి చేరుకోవ టానికి, అచ్చట పనులు చక్క బెట్టుకొని, తిరిగి వారి ఇల్లకు వెంటనే చెరుకోవటా నికి రానున్న కొత్త ప్రభుత్వం, ప్రభుత్వంలో ఉన్నటు వంటి ప్రజాప్రతి నిధులు చొరవ చూపి అతిచేరువలో చేరుకొనే రోడ్లు,కొన్ని గ్రామాలతారు రోడ్లకు మోక్షం కలిగేటట్లు చూసి ప్రజలకి ఇబ్బందులు లేకుండా చూడవలసిన అవసరం ఎంతైనా ఉంది.

షిరిడి సాయి ఆశ్రమంలో
బుద్ధ పౌర్ణమి ఉత్సవం
షిరిడి సాయిని దర్శించుకున్న వందలాది భక్తులు



పూసపాటిరేగ, మే 23, మేజర్‌న్యూస్: మండలంలోని కందివలస గ్రామం సమీపంలో ఉన్న మహిమాన్విత శ్రీ శిరిడి సాయి ఆశ్రమంలో బుద్ధ పౌర్ణమి మహోత్సవాలు భక్తుల నడుమ గురువారం ఘనంగా జరిగాయి. ఆధ్యాత్మికవేత్త, సాయి గురు బొడ్డు విజయరామయ్య ఆధ్వర్యంలో షిరిడి సాయిబాబాకు వేకుమా జాము నుంచే పాలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. సాయి గురు విజయ రామయ్య నిలువెత్తు భక్తులకు దర్శనమిస్తున్న షిరిడి సాయినాధునికి సుప్రభాత సేవతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక హారతులతో పాటు షిరిడినాదునికి పంచామృతాలతో కూడిన అభిషేకాలను నిర్వహిస్తూ సాయినా ధునికి గీతాలాపనను నిర్వహించారు. అంతకుముందు భక్తులు షిరిడి సాయినా ధుని ముందు భాగంలో ఉన్న ప్రత్యేక ధోనిలో కొబ్బరికాయలను వేసి ప్రదక్షిణల ను చేస్తూ ముక్కులను తీర్చుకున్నారు. అనంతరం మహిమాన్వితవైన సాయి దివ్య చరిత్ర తో పాటు సాయి లీలలను సాయి గురు విజయరామయ్య భక్తులకు వివరించారు. ప్రస్తుతం ఉన్న కలియుగంలో సాయినాధుని స్మరించుకుంటే భక్తి భావం పెరగడమే కాకుండా భక్తులకు మంచి జరుగుతుందన్నారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అనుమతుల్లేని లే-అవుట్స్ వద్ద
హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

కురుపాం, మే 23, మేజర్‌న్యూస్: కురుపాం మండలం కురుపాం పంచాయతీ పూతికవలసలో వేసిన ఎం వి ఆర్ నగర్ రియల్‌ఎస్టేట్ వద్ద సచివాలయ అధికారులు హెచ్చరిక బోర్డులను గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో ఏర్పాటు చేశారు. గ్రామానికి అనుసరించి వేసిన పలు సైట్లకు ఇంతవరకు ఎటువంటి పంచాయతీ కానీ బుడ వారి వద్ద కానీ అనుమతులు లేకుండా ఇష్టానుసారుగా అమ్మకాలు చేపట్టారని అందుకే హెచ్చరిక బోర్డులను తగిలించామని విఆర్ఓ స్వరాజ్యం, రశ్మిత,సునీత, అధికారులు తెలిపారు. ఇకనుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అమ్మకాలు చేసిన అటువంటి వారిపై పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పంచాయతీ అధికారులు తెలియజేశారు.

ప్రభుత్వ పాఠశాలలో
విద్యార్థుల చేరికలపై ప్రత్యేక డ్రైవ్

పూసపాటిరేగ, మే 23, మేజర్‌న్యూస్: మండలంలోని కందువలస ప్రాథమికో న్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు చందువలస తో పాటు పరిసర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలంటూ ప్రత్యేక డ్రైవ్ ను గురువారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో పాటు నిలువులతో కూడిన విద్యను అందించడం జరుగుతుందన్నారు. అలాగే ప్రభుత్వం విద్యార్థులు కావలసిన ఏకరూప దుస్తులతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రావు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

నేడు గోవిందపురం సబ్ స్టేషన్
పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

పూసపాటిరేగ, మే 23, మేజర్‌న్యూస్: మండలంలోని గోవిందపురం విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ విజయనగరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి సురేష్ బాబు తెలిపారు. విద్యుత్ లైన్లను మరమ్మత్తులు చేయడంతో పాటు చెట్ల కొమ్మలను తొలగించే చర్యల్లో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వెంపడం, తాళ్ల పేట, సేరి పేట, గుంపం, తొత్తడం, గోవిందపురం, నక్కన పేట, లంకలపల్లి గ్రామాలకు చెందిన వారు ఈ అసౌకర్యాన్ని గమనించాలని ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు రాజకీయ నాయకులతో జిల్లా ఎస్పీ సమావేశం

రావికమతం, మే 23, మేజర్‌న్యూస్: అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ చోడ వరం నియోజకవర్గ రాజకీ య నాయకులతో సమాసం కారణాలని ఎస్ఐ ధనంజ యుడు తెలిపారు. శుక్రవా రం 10 గంటలకు స్థానిక తిరుమల కళ్యాణ మండపం లో నిర్వహించిన ఈ సమావేశానికి నియోజకవర్గంలో రోలుగుంట బుచ్చయ్యపేట, రావికమతం చోడవరం మండలాలకు చెందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరుకానున్నారని తెలిపారు.

పండగ ముగిసిన వేళ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

పూసపాటిరేగ, మే 23, మేజర్‌న్యూస్: మండలంలోని వెంపడం, తాళ్ల పేట గ్రామాల్లో పండగ ముగియడంతో అధికారులు పారిశుద్ధ్యం మెరుగుపరచడం పై దృష్టి సారించారు. మండల పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాస పర్యవేక్షణలో ఐదుగురు పంచాయతీ కార్యదర్శులు క్లాప్ మిత్రలతో దగ్గరుండి అపరిశుభ్రంగా ఉన్న పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే చర్యలు చేపట్టారు. పండగకు వేలాదిమంది భక్తులు, బంధువులు తరలి రావడంతో ప్లాస్టిక్ వినియోగం అపరిమితంగా పెరిగిపోయింది. దీనితో వెంపడంతో పాటు తాళ్ల పేట, సేరి పేట గ్రామాల్లో అపరిశుభ్రత తాండవించడంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా అంటూ రాగాలు ప్రబలకుండా క్లాప్ మిత్రల ద్వారా పేరుకుపోయిన పారిశుద్ధ్యాన్ని డంపింగ్ చేసి నిలువ చేసిన నిల్వచేసిన పారిశుద్ధ్యాన్ని వాహనాల ద్వారా డంపింగ్ యార్డ్ లకు తరలించే చర్యలు చేపట్టారు. దీనితో వెంపడం పంచాయతీ పారిశుద్ధ్య నిర్వహణలో మెరుగుపరిచినట్లు అయింది.

రీ సర్వేలో గుర్తించిన రెండు కోట్లు విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం
- దీనిలో 20 సెంట్లు డంపింగ్ యార్డ్‌కు కేటాయింపు
- మండల కేంద్రానికి తీరిన డంపింగ్ యార్డ్ సమస్య

రావికమతం, మే 23, మేజర్‌న్యూస్: మండల కేంద్రాన్ని గత కొంతకాలంగా పట్టిపీడిస్తున్న డంపింగ్ యార్డ్ సమస్య ఎట్టకేలకు పరిష్కారం అయింది. పట్టణీకరణ వైపు పరుగులు పెడుతున్న మండల కేంద్రానికి డంపింగ్ యార్డ్ స్థలం కేటాయించాలని గత 20 సంవత్సరాలుగా పంచాయతీ సర్పంచులు అధికారులు రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు చేస్తున్నారు. అయితే మండల కేంద్రంలో డంపింగ్ యార్డ్ కోసం ప్రభుత్వ స్థలం లేదని రెవెన్యూ అధికారులు చేతులెత్తేసేరు .ఫలితంగా తాసిల్దార్ కార్యాలయం , సబ్ స్టేషన్, హై స్కూల్ ప్రహారికి అనుకొని ఉన్న ఖాళీ స్థలాలను ఇంతవరకు డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తున్నారు. వీటిపై అధికారులు, ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ గత్యంతరం లేక పంచాయతీ సిబ్బంది గ్రామంలోని ఊడ్చిన చెత్తను ఇక్కడే పోగులుగా వేస్తున్నారు. జనావాసాల మధ్య ఉన్న డంపింగ్ యార్డ్ తరలించాలని గ్రామస్తులు సైతం పలుమార్లు జిల్లా కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ప్రయోజనం శూన్యం. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో రావికమతం గ్రామంలో భీమునిపట్నం -నర్సీపట్నం రోడ్డు కి ఆనుకొని ఉన్న సర్వేనెంబర్ 65-1లో 52 సెంట్లు రోడ్డు పోరంబోకు ఉందని సర్వే అధికారులు గుర్తించారు. దీని విలువ ప్రభుత్వ లెక్కల్లో 3 లక్షల రూపాయలు మాత్రమే ఉండగా మార్కెట్ ధర రెండు కోట్లు రూపాయలు వరకు పలుకుతుంది . ఈ భూమికి సంబంధించి ఆక్రమణదారులు ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో రెవెన్యూ అధికారులు సంబంధిత భూమిని స్వాధీనం చేసుకున్నారు. దీనిలో 20 సెంట్లు భూమిని పంచాయతీకి డంపింగ్ యార్డ్ గా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రస్తుతం జనావాసాల మధ్య ఉన్న కంపోస్టును గురువారం పంచాయతీకి కేటాయించిన డంపింగ్ యార్డ్ లోకి పంచాయతీ సిబ్బంది తరలిస్తున్నారు.

26న మహిళల జిల్లా
క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు

విజయనగరం బ్యూరో, మే 23, మేజర్‌న్యూస్: ఈ నెల 26 ఆదివారం మహిళల విభాగంలో అండర్ - 15, అండర్ -19, అండర్ -23, సీనియర్ మహిళల జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎం ఎల్ ఎన్ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం శివారు విజ్జీ క్రికెట్ ప్రాంగణంలో నిర్వహించే ఎంపిక పోటీలకు అండర్ -15 బాలికల విభాగంలో హాజరయ్యే క్రీడాకారిణిలు 2009 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలని, అండర్ -19 విభాగంలో హాజరయ్యే క్రీడాకారిణిలు 2005 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాల ని, అండర్ - 23 విభాగంలో హాజరయ్యే క్రీడాకారిణిలు 2001 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. సీనియర్ విభాగంలో హాజరయ్యే క్రీడాకారిణిలకు అదే రోజు ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందనీ తెలిపారు. పోటీలకు హాజరయ్యే వారు ఒరిజినల్ ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువపత్రం, గత మూడేళ్ళ స్టడీ సర్టిఫికెట్స్ తీసుకొని రావాలన్నారు. ఎంపిక పోటీలు ఉదయం 6.30 గంటలకు ప్రారంభమవుతాయని, క్రీడాకారులు వైట్ డ్రెస్, సొంత కిట్ తో హాజరు కావాలని ఆయన కోరారు.